

ఎల్ ఆర్ఎస్‌కు సాఫ్ట్‌వేర్ సమస్యలు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..




సంపుటి - 2 సంచిక -30 శనివారం 29 మార్చి 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## మయన్మార్, థాయ్‌లాండ్‌లో

# భూవిలయం

### మయన్మార్ లో 182కి పెరిగిన మృతుల సంఖ్య

### భారత్‌లోనూ పలుచోట్ల భూ ప్రకంపనలు

**మేఘాలయాలో రిక్టర్ స్కేల్‌పై 4.4 గా నమోదు**

**ఢిల్లీ, కోల్‌కతా, రాంచీ, త్రిపుర, అసాం, పాట్నాలోనూ ఎఫెక్ట్**



మిగతా 2లో

మయన్మార్, థాయ్‌లాండ్ దేశాల్లో శుక్రవారం భారీ భూకంపాలు సంభవించించాయి. నిమిషాల వ్యవధిలో రెండు సార్లు వచ్చిన భూకంపానికి ఆ దేశాలు చిగురుటాకులా వణికిపోయాయి. ముందుగా మయన్మార్‌లో తొలి భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై 7.7గా నమోదైంది. ఆ తర్వాత రెండో భూకంప తీవ్రత 6.4గా నమోదైంది. సెంట్రల్ మయన్మార్‌లోని మోనివా నగరానికి తూర్పున 50 కిలోమీటర్ల దూరంలో 10కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే గుర్తించింది. ఈ భూకంపం ధాటికి పలు భవనాలు ఊగిపోయాయి. పలుచోట్లు ఎత్తైన అంతస్తులు నేలకూలినట్లు స్థానిక మీడియా వెల్లడించింది

- మయన్మార్ లో 7.7 తీవ్రతతో భూకంపం
- మయన్మార్ లో ఒక్కరోజే మూడు వరుస భూకంపాలు
- మయన్మార్, థాయ్‌లాండ్‌లో మృత్యుఘోష
- భారీ భూకంపంతో శిథిలమైన బ్యాంకాక్
- కండ్లముందే కుప్పకూలిన వేలాది భవనాలు
- క్షణాల వ్యవధిలో రెండుసార్లు కంపనాలు
- శిథిలాలుగా మారిన పలు పట్టణాలు.. గ్రామాలు
- మయన్మార్‌లో 7.7, థాయ్‌లో7.4 నమోదు
- ప్రాణ భయంతో పరుగులుతీసిన జనం
- శిథిలాల చిక్కుకుపోయిన వేలాది మంది
- ఆర్తనాథాలు, మృతదేహాలతో బీతావహంగా సిటీ
- మృతుల సంఖ్య వేలల్లో ఉంటుందని ఆందోళనలు
- థాయ్‌లాండ్‌లో కూలిన ప్రసిద్ధ బౌద్ధారామాలు
- మాండేలాలో కూలిపోయిన చారిత్రాత్మక వంతెన
- విమాన, మెట్రో, రైలు, బస్సు సర్వీసులన్నీ నిలిపివేత
- థాయ్?లాండ్‌లో అత్యవసర పరిస్థితి విధింపు
- సహాయక కార్యక్రమాల్లోకి దిగిన ఆర్మీ సిబ్బంది

## సెంట్రల్ వర్సిటీ భూముల

# అమ్మకం అవివేకం

### ఇది ప్రకృతి విధ్వంసకర చర్య మాత్రమే

### ట్విట్టర్ వేదికగా కెటిఆర్ విమర్శలు



**హైదరాబాద్**మార్చి28(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ అవివేకపూరిత నిర్ణయం వల్ల హైదరాబాద్ నగరం ఒక పెద్ద హరిత ప్రాంతాన్ని కోల్పోనుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా విమర్శిస్తూ ట్విట్టర్ వేదికగా కీలక వ్యాఖ్య చేశారు. కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల భూమిని అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నానని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాదు, అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఒక ప్రకటనపై కూడా ఆయన స్పందించారు.**మిగతాది 2లో...**



## సన్నబియ్యం పంపిణీ

# విప్లవాత్మకం

- రేపు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం
- హుజూర్‌నగర్‌లో ప్రారంభించనున్నసిఎం రేవంత్‌రెడ్డి
- 90లక్షలరేషన్‌కార్డులు2.5కోట్ల మందిలబ్ధిదారులు
- అదనంగా మరో30లక్షల మంది లబ్ధిదారులుచేరవచ్చునని అంచనా
- బిపిఎల్‌కుటుంబాలకు మూడురంగులకార్డులు ఎపిఎల్ వారికి గ్రీన్‌కార్డులు
- పౌరసరఫరాలశాఖ మంత్రిఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్ మార్చి28(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా ఉగాది పండుగ నుంచి రేషన్‌కార్డులు కలిగిన పేదలందరికీ సన్నబియ్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈనెల 30వ తేదీ ఉగాది పండుగ రోజునన హుజూర్‌నగర్ లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుజూర్‌నగర్‌లో పేదలకు సన్నబియ్యం పథకాన్ని ప్రారంభిస్తారని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో పౌరసరఫరాల శాఖ స్పెషల్ కమిషనర్ డిఎస్ చౌహాన్ తో కలిసి మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 90 లక్షల రేషన్ కార్డులు, 2.85 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని, వీరి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.10,665 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నాయని చెప్పారు. త్వరలోనే సన్నబియ్యంతో పాటు పప్పు, ఉప్పు లాంటి ఇతర నిత్యవసర వస్తువులు కూడా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.**మిగతాది 2లో...**


# పాలమూరుకు జాతీయ హెూదా ఇవ్వడం కుదరదు

: స్పష్టం చేసిన కేంద్ర ప్రభుత్వం

పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హెూదా కల్పించాలని కోరిన టీజీ ప్రభుత్వం

కృష్ణా నది జలాలపై ఏపీ, తెలంగాణ మధ్య వివాదం

రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను వెనక్కి పంపించామన్న కేంద్ర జల్ శక్తి శాఖ



2లో

# భావస్వేచ్ఛను గౌరవించాలి

### అది ప్రాథమిక హక్కు

### కిందకే వస్తుంది

### సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,మార్చి28(జర్నలిస్ట్ వార్త):కవిత్వం, నాటకం, స్టేజీ ప్రదర్శనలు, వ్యంగ్యం మరియు కళల ద్వారా భావాన్ని స్వేచ్ఛగా వ్యక్తీకరించే ప్రాథమిక హక్కుని గౌరవించాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. 'ఏ ఖూన్ కే ప్యాసె బాత్ సునో ' అనే కవితను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినందుకు కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిపై గుజరాత్ పోలీసులు నమోదు చేసిన కేసును శుక్రవారం కొట్టివేసింది. వాక్‌స్వేచ్ఛ మరియు భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడటానికి కోర్టులు ముందంజలో ఉండాలని పేర్కొంది. ఉదారవాద, రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన హక్కులైన వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ప్రతి విమర్శ లేదా అసమ్మతిని తమ అధికారం మరియు స్థానానికి ముప్పుగా భావించే అభద్రతా భావంతో బలహీనం చేయకూడదని జస్టిస్ ఎస్.ఓకా, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. వాక్ స్వాతంత్ర్యంపై సహేతుకమైన ఆంక్షలు సహేతుకంగానే ఉండాలని జస్టిస్ భుయాన్ వివరించారు. ఆంక్షలు హానికరం లేదా అణచివేతగా ఉండకూడదని, స్వేచ్ఛగా మాట్లాడే



ప్రాథమిక హక్కుని ఆంక్షలు కప్పివేయలేవని జస్టిస్ భుయాన్ సూటిగా పేర్కొన్నారు. ఒక వ్యక్తి వాక్, భావ ప్రకటనా హక్కుని కాపాడటం , గౌరవించడం పోలీసుల, ప్రభుత్వాల భాద్యత అని ధర్మాసనం ఉద్ఘాటించింది. కవిత్వం, నాటకం, సినిమాలు, రంగస్థల ప్రదర్శనలు, వ్యంగ్యం, కళలు సహా సాహిత్యం జీవితాన్ని మరింత అర్ధవంతం చేస్తుందని, వ్యక్తులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను వ్యక్తీకరించే హక్కులను గౌరవించాలని జస్టిస్ ఓకా పునరుద్ఘాటించారు. ఆరోగ్యకరమైన ,నాగరిక సమాజంలో వాక్ స్వాతంత్ర్యం అంతర్భాగమని, మెజారిటీ- వ్యక్తులు అభిమానిస్తున్నారనే కారణంతో ఒక వ్యక్తి అభిప్రాయాలను అణచివేయలేమని కోర్టు వ్యాఖ్యానించింది. పోలీసులు కూడా భిన్నాభిప్రాయాలను కాపాడాలని, అవి కూడా ప్రజాస్వామ్య విధుల్లో ఒక భాగమని కోర్టు పేర్కొంది**మిగతా2లో...**

# కేంద ప్రభుత్వ ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంపు

ప్రధాని అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ

తాజా పెంపుతో 53 నుంచి 55 శాతానికి పెరిగిన డీఏ



2లో

# సెంట్రల్ వర్సిటీ భూముల అమ్మకం అవివేకం

(మొదటి పేజి తరువాయి)
నిన్న అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి, ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని తప్పుగా పేర్కొన్నారు. అయితే, విద్యార్థులు, అధ్యాపకుల సమాచారాన్ని ప్రకారం, హైదరాబాద్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో 700కు పైగా పుష్ప వృక్ష జాతులు, 10 రకాల సస్తన ప్రాణులు, 15 రకాల సరీసృపాలు , 200కి పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాదు, అక్కడి శిలా నిర్మాణాలు ఏకంగా బిలియన్ సంవత్సరాల చరిత్ర కలిగి ఉన్నాయని వివరించారు. ఈ నిర్ణయాన్ని కెటిఆర్ తీవ్రంగా తప్పుబడుతూ, ఇది తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఓ విపరీతమైన నిర్ణయం. ఒక వైపు ప్రకృతి రక్షణ అంటూ మాట్లాడుతూ, మరోవైపు ప్రకృతి నాశనానికి పాల్పడటం ఆశ్చర్యకరం. ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చేందుకు, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చే చర్య అని మండిపడ్డారు. ఈ నేపథ్యంలోఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ ప్రభుత్వాన్ని నేను కోరుతున్నాను!అంటూ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## బివైడీ కార్ల సంస్థ రావడం ఆనందదాయకం

### బిఆర్ఎస్ కృషి వల్లనే సాధ్యమయ్యిందన్న కెటిఆర్



హైదరాబాద్,,మార్చి28(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రాని బీవైడీ కార్ల సంస్థ పెట్టుబడి రావడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతోషం వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ విధానాల వల్లే రాష్ట్రానికి బీవైడీ సంస్థ వచ్చిందన్నారు. 2023లోనే 10 బిలియన్ డాలర్ల పెట్టు-బడికి బీవైడీ, ఒలెక్ట్రా అంగీకారం కుదుర్చు కున్నాయని చెప్పారు. బీవైడీ కంపెనీ రాష్ట్రానికి రావడం ఫార్ములా-ఈ రేసు ప్రత్యక్షఫలితమని వెల్లడించారు. బీవైడీ రాకకు ఏండ్ల తరబడి కష్టపడిన అందరికి ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు.'బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితోనే తెలంగాణకు బీవైడీ సంస్థ వచ్చింది. నాడు బీఆర్ఎస్ చేసిన కృషి.. నేడు ఫలితించింది. దిగ్గజ కంపెనీ భారీ పెట్టు-బడితో యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయి. ఫార్ములా-ఈ రేసు నిర్వహణతో ప్రపంచం దృష్టిని తెలంగాణ ఆకర్షించింది. ప్రభుత్వాలు మంచి విధానాలు ప్రవేశపెడితే నీఛమైన రాజకీయాలను అధిగమించి మంచి ఫలితాలు వస్తాయి. తాము ప్రవేశపెట్టిన తెలంగాణ మొబిలిటీ- వ్యాలీ, ఈవీ విధానం వల్లే ఈ రోజు బీవైడీ తెలంగాణకు వచ్చింది. తెలంగాణ మొబిలిటీ- వ్యాలీ, ఈవీ పాలసీ భాగంగానే ఫార్ములా-ఈ రేస్‌ను నిర్వహించాం. తమ విధానాల వల్లే తెలంగాణకు ఇంత భారీ పెట్టు-బడి వచ్చింది. ఈ పెట్టు-బడి కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు.' అంటూ కేటీ-ఆర్ టీ-÷-వట్ చేశారు.

-----------

## ఎస్ఎల్‌బిసి వద్ద కొనసాగుతున్న సహాయకచర్యలు

నాగర్‌కర్నూల్స్,మార్చి28(జర్నలిస్ట్ వార్త)::నాగర్‌కర్నూల్ జిల్లాలోని దోమలపెంట ఎస్ఎల్‌బీసీ సొరంగంలో సహాయక చర్యలు నిర్విరామంగా కొనసాగుతున్నాయి. సొరంగం లోపల జరుగుతున్న సహాయక చర్యల్లో పాల్గొంటున్న సహాయక బృందాల ఉన్నతాధికారులతో ప్రత్యేక అధికారి శివ శంకర్ లోతేటి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ లోపల చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు నిరంతరాయంగా పనిచేస్తున్న సహాయక బృందాల సహాయక చర్యలపై
అభినందిస్తూ, రెట్టింపు వేగంతో సహాయక చర్యలను కొనసాగించాలని అధికారులకు సూచించారు. జీఎస్ఐ అధికారుల సూచనలకు అనుగుణంగా ప్రమాద ప్రదేశం నుంచి 30 మీటర్ల వరకు బారీ కేడింగ్ చేసినట్లు-, జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పర్యవేక్షణ జరుపుతున్నట్లు వివరించారు. టన్నెల్ లోపల సహాయక చర్యలలో భాగంగా సొరంగంలో మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు-, తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న స్టీల్‌ను తొలగిస్తూ, ఎప్పటికప్పుడు ఊట నీటిని పంపుల ద్వారా బయటకు తరలిస్తున్నట్లు- వివరించారు. ప్రమాద ప్రదేశం సమీపంలో మట్టి కింద ఉన్న లోకో -ట్రైన్ క్యాబిన్లను తొలగించి లోకో ఇంజిన్‌ను బయటకు తీసేందుకు, సహాయక బృందాలు పూర్తిస్థాయిలో చర్యలు వేగవంతం చేస్తున్నాయన్నారు. ప్రమాద ప్రదేశం సమీపంలో ఉన్న పెద్దపెద్ద బండరాళ్లను ఎస్కవేటర్ ద్వారా తొలగిస్తూ, టీ-బీఎం భాగాలను అల్ట్రా థర్మల్ కట్టర్‌తో కట్ చేస్తూ వాటి భాగాలను లోకో -ట్రైన్ ద్వారా బయటకు తీసుకువస్తున్నట్లు- తెలిపారు. తవ్వకాల ద్వారా తీస్తున్న మట్టిని కన్వేయర్ బెల్ట్ గుండా బయటకు తరలిస్తున్నట్లు-, ప్రమాద ప్రదేశ సమీపం వరకు కన్వేయర్ బెల్ట్‌ను పొడిగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఆర్మీ అధికారులు వికాస్ సింగ్, విజయ్ కుమార్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, కల్వకుర్తి ఆర్డీవో శ్రీనివాసులు, ఎన్డీఆర్ఎఫ్ అధికారి కిరణ్ కుమార్, ఎస్డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్ రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే అధికారి నేతి చంద్ర, జీఎస్ఐ అధికారి పంకజ్ తిరుగున్, హైడ్రా అధికారి యజ్ఞ నారాయణ, జేపీ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శనగరైతులకు కేంద్రం ఊరట

### దిగుమతులపై 10శాతం సుంకం విధింపు

న్యూఢిలీమార్చి28(జర్నలిస్ట్ వార్త):
దేశంలో ఈ ఏడాది దేశీ శనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు చేరుకోవడంతో కేంద్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతోంది. దేశంలోని రైతులకు మేలు జరిగేలా ఏప్రిల్ 1 నుంచి వచ్చే కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి శనగ దిగుమతులపై 10శాతం దిగుమతి సుంకాన్ని విధిస్తూ నిర్ణయం తీసుకుంది. గత సంవత్సరం పాటించిన సుంకం లేని విధానాన్ని రద్దు చేస్తూ కేంద్రం చర్యలు చేపట్టింది. బదులుగా ఏప్రిల్ 1 నుండి దేశీ శనగపై 10దిగుమతి సుంకాన్ని తిరిగి ప్రవేశపెట్టింది. దేశంలో ఈ ఏడాది చనగ ఉత్పత్తి 11.5 మిలియన్ టన్నులకు పెరుగుతుందని అంచనా వేస్తున్నందున ఈ చర్యలకు ఉపక్రమించాల్సి వచ్చిందని కేంద్రం చెబుతోంది. ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చేలా దేశీ శనగ పై ప్రభుత్వం 10శాతం దిగుమతి సుంకాన్ని విధించింది. గత సంవత్సరం మే నెలలో, దేశీయ లభ్యతను పెంచడానికి, ధరలను నియంత్రించడానికి ప్రభుత్వం సుంకం లేని శనగ దిగుమతిని అనుమతించింది. దిగుమతి సుంకం మినహాయింపు మార్చి 31, 2025 వరకు వర్తిస్తుంది. ఈ మార్పుకు సంబంధించి ఈ నెల 27న ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రభుత్వ డేటా ప్రకారం, చనగ ఉత్పత్తి 2024-25లో 11.5 మిలియన్ టన్నులుగా అంచనా వేశారు. అయితే, ఇది గతేడాది ఇది 11 మిలియన్ టన్నులు.

## భావస్వేచ్ఛను గౌరవించాలి

ఆలోచనా స్వేచ్ఛ లేకుండా భావప్రకటన లేకుండా రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 హామీ ఇచ్చిన గౌరవప్రదమైన జీవితాన్ని గడపడం అసాధ్యం అని జస్టిస్ ఓకా పేర్కొన్నారు. పోలీసులు మరియు ప్రభుత్వం వాక్ స్వాతంత్ర్యాన్ని కాపాడటంలో విఫలమైతే కోర్టులు తప్పకుండా జోక్యం చేసుకోవాలని, పౌరుల ప్రాథమిక హక్కులను కాలరాయకుండా చూసుకోవడం కోర్టుల విధి అని పేర్కొన్నారు.కులం మతం ఆధారంగా వివిధ వర్గాల ప్రజల మధ్య శత్రుత్వాన్ని పెంచుతున్నారని ఆరోపిస్తూ గుజరాత్ పోలీసులు ప్రతాప్‌గర్హిపై కేసు నమోదు చేశారు. మార్చి 3 విచారణ సమయంలో ఈ కవిత అహింసను సూచిస్తుందని మహాత్మాగాంధీ స్వయంగా అనుసరించిన మార్గమని మార్చి 3న జరిగిన విచారణలో జస్టిస్ ఓకా పేర్కొన్న సంగతి తెలిసిందే.

# సన్నబియ్యం పంపిణీ విప్లవాత్మకం

(మొదటి పేజీ తరువాయి)
రేషన్ షాపుల్లో పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న దొడ్డు బియ్యం వినియోగించకపోవడం వల్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది, అక్రమ వ్యాపారానికి పునాది అవుతుంది, డీలర్ల నుంచి బ్లాక్‌లో అక్కడక్కడా అమ్ముకుంటున్న ఉదంతాలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టించని వారిపట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. దీనిని మార్చడానికి రాష్ట్రంలో పేదలు, నిరుపేదలకు నిజమైన ఆహార భద్రత కల్పించాలనే గొప్ప ఆలోచనతో రాష్ట్ర మంత్రివర్గం చర్చించి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీంతో రేషన్ కార్డులు కలిగిఉన్న 80 నుంచి 84 శాతం జనాభాకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీకి ఉగాది రోజున శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు.

**పదేండ్లలో 49వేల కార్డులు జారీ**

తెలంగాణ ఏర్పాటు నాటికి రాష్ట్రంలో 89 లక్షల 73వేల 708 కార్డులు కలిగిన 2.85కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని, గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో కేవలం 49వేల 479 కొత్త కార్డులు మాత్రమే మంజూరు చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం గత పది నెలల కాలంలో దానికి పదిరెట్లు కొత్త రేషన్ కార్డులు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను తాము పరిశీలించి విచారణ చేసి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఎంతమందికి కొత్త రేషన్ కార్డులు కావాలన్నా వారి అర్హతను బట్టి సాచ్యురేషన్ మోడ్‌లో ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, కొత్త రేషన్ కార్డు మంజూరి నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని వివరించారు. కొత్త కార్డుల జారీ వల్ల అదనంగా 15 శాతం వరకు సన్నబియ్యం సరఫరా పెరుగుదల ఉండే అవకాశం ఉంటుందని దాంతో ప్రస్తుతం ఏడాదికి 24లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం డిమాండ్ కాస్తా 28 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగే అవకాశం ఉంటుందాని తెలిపారు.

**ఫిజికల్ రేషన్ కార్డులు**

రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా ఫిజికల్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కొత్త ఫిజికల్ కార్డులు రెండు రకాలుగా ఉంటాయని, దారిద్ర్యరేఖకు దిగువన(బిపిఎల్) కుటుంబాలకు మూడు రంగులతో కూడిన ఫిజికల్ రేషన్ కార్డు, దారిద్ర్యరేఖకు ఎగువన(ఏపిఎల్) కుటుంబాలకు గ్రీన్ కార్డులు రూపొందించామని, వాటిని త్వరలో ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. ఫిజికల్ రేషన్ కార్డులలో చిప్ అంటూ ఏదీ ఉండదని, ఫిజికల్ రేషన్ కార్డుపై ప్రధాని నరేంద్రమోదీ బొమ్మ విషయంపై ఆలోచన చేద్దాం అని ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడి నుంచేనా రేషన్ సరుకులు తీసుకోవడానికి వీలుగా డ్రా సిస్టం అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలిపారు. కార్డు ఉన్నా, లేకున్నా లబ్ధిదారుల వివరాలు జాబితాలో ఉంటే సన్న బియ్యం ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి తీసుకోవచ్చునని మంత్రి వివరించారు.

**అదనపు భారంపై కేంద్రాన్ని కోరాం**

పేదలకలు ఆహారభద్రత కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై పడుతున్న అదనపు భారాన్ని కేంద్రం భరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తాను స్వయంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పట్ల కేంద్రం సంతృప్తివ్యక్తం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిని అంగీకరించి పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు. ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇచ్చి రైతుల నుంచి సన్నబియ్యం సేకరించి రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సిఐ)కి ఎప్పటిలాగా దొడ్డురకం బియ్యం సరఫరా కొనసాగుతుందని కమిషన్ చౌహాన్ వివరించారు.

# మయన్మార్, థాయ్‌లాండ్‌లో భూవిలయం

(మొదటి పేజీ తరువాయి)
ఈ భూ ప్రకంపనలతో మయన్మార్‌లోని మాండలేలోని ఐకానిక్ అవా వంతెన కుప్ప కూలింది. ఇరావడీ నదిలోకి వంతెన కూలిపోయిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. కాగా, కూలిన భవనాలు, ఇళ్లలో వేలాది మంది చిక్కుకున్నారు.. మయన్మార్‌లో విమాన, రైలు సర్వీసులన్నీ నిలిపివేశారు. సహాయక కార్యక్రమాల కోసం సైన్యాన్ని రంగంలోకి దింపారు. భూకంప సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని ఆ దేశ అధినేతలు కోరారు.మయన్మార్ భూకంప తీవ్రత భారీగా ఉంది. వరుస భూకంపాల వల్ల ఆ దేశంలోని పలు చోట్ల భవనాలు కుప్పకూలాయి. ఓ భవనంలో 43 మంది గల్లంతు అయినట్లు సమాచారం. అలాగే భారీ స్థాయిలో ఆస్తి నష్టం వాటిల్లిందని తెలుస్తోంది. భూకంపం ధాటికి మండాలేలోని చారిత్రక అవా బ్రిడ్జ్ కూడా కుప్పకూలింది. మయన్మార్ వాయువ్య ప్రాంతంలో భూకంప కేంద్రం గుర్తించారు.
మరోవైపు ఈ భూకంపం కారణంగా థాయ్‌లాండ్‌లో కూడా భూమి కంపించింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ లో 7.3 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఈ భూకంపం ధాటికి ఎత్తైన భవనాలు పేకమేడల్లా కుప్పకూలిపోయాయి. ఈ ఘటనలో అనేక మంది గల్లంతైనట్లు తెలిసింది. ఈ భూకంపంతో థాయ్‌లాండ్‌లో ఆదేశ ప్రధాని ఎమర్జెన్సీ ప్రకటించారు. దీంతో బ్యాంకాక్‌లోని భవనాలను ఖాళీ చేయిస్తున్నారు అధికారులు. మెట్రో, రైల్వేతో పాటు విమాన సర్వీసులను వెంటనే నిలిపివేశారు. అలాగే ఇక్కడ ఉన్న అనేక సుప్రసిద్ధ బౌద్ధరామాలు కూడా కుప్పకూలాయి.. ఆ దేశంలో భారీగా ప్రాణం నష్టం జరిగిందని అధికారుల అంటున్నారు.

**భారత్‌లోనూ..**

దేశ రాజధాని ఢిల్లీ-ఎన్సీఆర్, కోల్‌కతాతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లో స్వల్ప స్థాయిలో భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీ, ఘాజియాబాద్, నోయిడా, మేఘాలయా, కోల్‌కతా, మణిపూర్‌లోని ఇంఫాల్‌లో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. మేఘాలయా ఈస్ట్ గారోహిల్స్‌లో 4.4 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఏం జరుగుతోందో అన్న టెన్షన్‌తో ఇళ్లు, కార్యాలయాల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు.
మరోవైపు చైనాలోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. చైనాలోని నైరుతి యునాన్ ప్రావిన్స్‌లో భూమి కంపించినట్లు బీజింగ్ భూకంపం సంస్థ తెలిపింది. ఈ ప్రకంపనలు రిక్టరు స్కేలుపై 7 తీవ్రతతో నమోదైనట్లు వెల్లడించింది. అలాగే భూకంప తీవ్రత బంగ్లాదేశ్ ను తాకింది..
మయన్మార్ లో ఇవాళ 7.7 తీవ్రతతో సంభవించిన భారీ భూకంపం విలయం సృష్టించింది. భారీ భవనాలు సైతం నేలమట్టం అయ్యాయి. మయన్మార్ లో పలు చోట్ల రోడ్లు బీటలు వారాయి. ఒక్కరోజులోనే మూడు వరుస భూకంపాలు ఈ చిన్న దేశాన్ని వణికించాయి. మయన్మార్ లో భూకంపం కారణంగా ఇప్పటివరకు 182 మంది మృతి చెందారు. భవనాల శిథిలాల్లో చిక్కుకుని 370 మంది గాయపడ్డారు. సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితుల దృష్ట్యా మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.
అటు, థాయిలాండ్, బంగ్లాదేశ్ లోనూ నేడు భూకంపాలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై వీటి తీవ్రత 7.3గా నమోదైంది.

# ముగ్గురు చిన్నారుల అనుమానాస్పద మృతి



**రాత్రి అన్నం తిని పడుకున్న పిల్లలు.. నిద్రలోనే కన్నుమూత**

**అర్ధరాత్రి కడుపు నొప్పితో ఆసుపత్రిలోచేరి కోలుకుంటున్న తల్లి**

**పిల్లలు తిన్న అన్నంలోవిషం కలిపింది ఎవరు?**

**అమీన్‌పూర్‌లోఅంతుచిక్కని ఘటన**

అమీన్‌పూర్:మార్చి28(జర్నలిస్ట్ వార్త):
సంగారెడ్డి జిల్లా, అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో ముగ్గురు చి న్నారులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందా రు.అయితే, చిన్నారుల మృతిపై అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. తల్లి, తన ముగ్గురు పిల్లలతో సహా సామూహిక ఆత్మహత్యకు పాల్పడిందా? లేక ఈ నలుగురిపై హత్యాయత్నం జరిగిందా? అన్న అనుమానాలు కలుతున్నాయి. శుక్రవారం తెల్లావారు జామున జరిగిన ఈ సం ఘటనలో పోలీసుల ప్రాథమిక విచారణలో తల్లి తన ముగ్గురు పిల్లలకు విషమిచ్చి తాను ఆత్మహత్యకు పాల్పడినట్టు గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే..అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో అవురిజింతల చెన్నయ్య భార్య రజిత అలియాస్ లావణ్య, ముగ్గురు పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. చెన్నయ్య స్వస్థలం రంగారెడ్డి జిల్లా, తలకొండపల్లి మండలం, మెడకపల్లి గ్రామం. అమీన్‌పూర్‌కు వచ్చి వాటర్ ట్యాంకర్ నడుపుకుంటూ కటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య స్థానికంగా ఉండే ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తోంది. గురువారం రాత్రి చెన్నయ్య పిల్లలైన సాయికృష్ణ (12), మధుప్రియ (10), గౌతమ్ (8), భార్యతో కలిసి భోజనం చేశాడు. భార్య, పిల్లలు పెరుగు అన్నం తిన్నారని తాను మాత్రం పప్పుతో తిని చందానగర్‌కు వాటర్ ట్యాంకర్ తీసుకొని వెళ్లినట్లు చెన్నయ్య తెలిపాడు. పని ముగించుకొని రాత్రి 11 గంటలకు ఇంటికి తిరిగొచ్చి పడుకున్నానని చెప్పాడు. అయితే తెల్లవారుజామున 3 గంటల సమయంలో తన భార్యకు తీవ్రమైన కడుపు నొప్పి వచ్చిందని, వెంటనే పొరుగు వారి సహకారంతో భీరంగూడలోని హాస్పిటల్‌కు తరలించానని పోలీసులకు తెలిపాడు. అనంతరం పిల్లలను పరిశీలించగా వారు విగత జీవులుగా పడి ఉన్నారని, లేపి చూడగా అప్పటికే చనిపోయారని చెప్పాడు. వెంటనే అమీన్‌పూర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సిఐ నరేశ్ తన సిబ్బందితో అక్కడికి చేరుకొని విచారణ చేపట్టారు. జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్, డిఎస్‌పి రవీందర్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్ టీంను రప్పించి పలు ఆధారాలను సేకరించారు. అనుమానాస్పద మరణాలుగా కేసును నమోదు చేశామని, చిన్నారుల మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహించిన తరువాత మరణాలకు గల కారణాలు తెలుస్తాయని ఎస్‌పి పేర్కొన్నారు. లావణ్య ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, ఆమె వద్ద నుంచి కూడా పలు వివరాలు తీసుకున్నామని చెప్పారు. విష ప్రయోగం జరిగినట్లు కనిపిస్తోందని, అన్ని కోణాల్లో విచారణ చేసి స్పష్టమైన వివరాలు తెలియజేస్తామని అన్నారు.

**మరణాలపై అనుమానాలెన్నో.. :**

ఇదిలా ఉండగా చిన్నారుల మరణాలపై ఎన్నో రకాల అనుమానాలు వస్తున్నాయి. పెరుగన్నం తిన్నారని చెబుతున్న చెన్నయ్య తాను ఇంట్లో లేనప్పుడే ఈ ఘోరం జరగడం వెనుక ఆంతర్యాన్ని ఛేదించే పనిలో పోలీసులు ఉన్నారు. అంతేగాక చెన్నయ్య, ఆయన భార్య లావణ్య ఈమధ్య కాలంలో తరుచూ గొడవ పడుతున్నారని లావణ్య తల్లి భారతమ్మ తెలిపారు. చెన్నయ్య మొదటి భార్య చనిపోవడంతో లావణ్యను రెండో పెళ్లి చేసుకున్నాడని, కొన్ని రోజుల క్రితం లావణ్య పేరుపై కొంత భూమి కూడా రిజిష్టర్ చేశాడని చెప్పారు. గతంలో రెండు, మూడుసార్లు గొడవలు జరిగినప్పుడు పిల్లలను చంపి తానూ చనిపోతానని లావణ్య తన భర్తను బెదిరించినట్లు అక్కడున్న బంధువులు చర్చించుకోవడం కనిపించింది. ఒకవేళ లావణ్యనే పిల్లలకు విషమిచ్చి తాను కూడా చనిపోవడానికి ప్రయత్నించిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మరోవైపు చెన్నయ్యను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. ఏదేమైనా చిన్నారుల మృతదేహాలకు పోస్ట్‌మార్టం నిర్వహిస్తే మరణాలకు గల కారణం తెలుస్తుందని, దాంతో ఓ క్లారిటీ వస్తుందని పోలీసులు పేర్కొంటున్నారు.

# కేంద ప్రభుత్వ ఉద్యోగులకు 2 శాతం డీఏ పెంపు

### ప్రధాని మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ భేటీ తాజా పెంపుతో 53 నుంచి 55 శాతానికి పెరిగిన డీఏ

అమరావతిమార్చి28(జర్నలిస్ట్ వార్త):
కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్డీయే సర్కారు శుభవార్త చెప్పింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ 2 శాతం పెంచుతున్నట్టు నేడు వెల్లడించింది. ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశమైంది. ఉద్యోగులకు డీఏ పెంచుతూ ఈ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తాజా పెంపుతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 53




శాతం నుంచి 55 శాతానికి పెరిగింది. అటు, రూ.22,919 కోట్లతో పీఎల్ఐ పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయ ఎలక్ట్రానిక్స్ రంగానికి ఊతం లభించనుంది. ముఖ్యంగా నాన్ సెమీ కండక్టర్ ఎలక్ట్రానిక్ పరిశ్రమలకు చేయూతనివ్వడమే ఈ కొత్త పథకం ముఖ్య ఉద్దేశం.

# మరోమారు ప్రధాని మోడీ విదేశీ పర్యటన

## వచ్చే నెలలో థాయిలాండ్, శ్రీలంక షెడ్యూల్



న్యూఢిల్లీమార్చి28(జర్నలిస్ట్ వార్త):
ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ వచ్చేనెల ఏప్రిల్లో విదేశీ పర్యటనకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాలకు వెళ్లనున్నారు. ఏప్రిల్ 3-4 తేదీల్లో థారులాండ్ ఆతిథ్యం ఇస్తున్న ఆరవ బిఐఎంఎస్‌టిఇసి (శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనగడానికి బ్యాంకాక్‌లో పర్యటించనున్నట్లు- భారత విదేశాంగ మంత్రిత్వశాఖ శుక్రవారం వెల్లడించింది. అనంతరం మోడీ ఏప్రిల్ 4-6 వరకు శ్రీలంకలో పర్యటించనున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలపై కొలంబోలో శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకతో మోడీ చర్చలు జరపున్నట్లు- భారత విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలిపింది. ఈ రెండు దేశాల పర్యటనలకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైనట్లు- విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ముందుగా ఏప్రిల్ 3 - 4 తేదీల్లో ప్రధాని థాయ్‌లాండ్‌లో పర్యటించనున్నారు. థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్రఆహ్వానం మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లబోతున్నారు. ఈ సందర్భంగా పేటోంగ్టార్న్‌తో భేటీ కానున్నారు. ఏప్రిల్ 4వ తేదీన బ్యాంకాక్‌లో జరగనున్న 'బే ఆఫ్ బెంగాల్ ఇనీషియేటివ్ ఫర్ మల్టీ సెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్'కూటమి సమావేశంలో పాల్గొంటారు. ఈ సమావేశంలో వాణిజ్యం, పెట్టు-బడులు, నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలంపై దేశాధినేతలతో చర్చించనున్నారు. ఆ తర్వాత థాయ్‌లాండ్ పర్యటనను ముగించుకొని ప్రధాని ఏప్రిల్ 4న శ్రీలంక వెళతారు. ఏప్రిల్ 6వ తేదీ వరకూ ఆ దేశంలో పర్యటించనున్నారు. ఆ దేశాధ్యక్షుడు అనురకుమార దిసనాయకే గతేడాది భారత్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన ఆహ్వానం మేరకు మోదీ శ్రీలంక పర్యటనకు వెళ్లబోతున్నారు. మోదీ తన పర్యటనలో రెండు దేశాల మధ్య కుదిరిన పలు ఒప్పందాలపై చర్చించనున్నారు.

------

# మరోమారు రాహుల్ అమెరికా పర్యటన?

## వచ్చే నెల 19 నుంచి అంటూ కథనాలు




న్యూఢిల్లీ,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ వర్గాలు వెల్లడించినట్లు- ఆంగ్ల మీడియాల్లో కథనాలు వస్తున్నాయి. ఏప్రిల్ 19 నుంచి రాహుల్ అగ్రరాజ్యంలో పర్యటిస్తారు. ఈసందర్భంగా ఆయన బ్రౌన్ యూనివర్శిటీని సందర్శిస్తారు. బోస్టన్‌లో ప్రవాస భారతీయులతోనూ ఆయన భేటీ అయ్యే అవకాశం ఉంది. అయితే, ఆయన యూఎస్‌లో ఎన్ని రోజులు పర్యటిస్తారనేది తెలియదు. అంతేకాక.. దీనిపై పార్టీ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన లేదు. గతేడాది సెప్టెంబరులో మూడ్రోజులు రాహుల్ యూఎస్‌లో పర్యటించారు. ఆ సమయంలో ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో రిజర్వేషన్లు, భారత్‌లో మత స్వేచ్ఛ వంటి అంశాలపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ప్రస్తుతం భారత్‌లో ఆదివాసీలు, దళితులు, ఓబీసీలకు సరైన ప్రాధాన్యం దక్కడం లేదని రాహుల్ అన్నారు. అప్పటివరకు అభివృద్ధిలో వారి భాగస్వామ్యం కూడా అంతంతమాత్రంగానే ఉంటుందని, దేశంలో అన్నివర్గాల వారికీ పారదర్శకంగా అవకాశాలు లభించే పరిస్థితులు వచ్చిన తర్వాతే రిజర్వేషన్ల రద్దు గురించి తమ పార్టీ ఆలోచిస్తుందన్నారు. ఇక, సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. భాజపా ఆయన మాటలను ఖండించింది. విదేశాల్లో భారత్ పరువుతీస్తున్నారని మండిపడింది. సిక్కులను ఉద్దేశిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా.. భాజపా మద్దతున్న ఒక గ్రూప్ దిల్లీలోని సోనియాగాంధీ నివాసం వెలుపల నిరసనలు సైతం తెలియచేసింది.

# ఎల్ ఆర్ ఎస్‌కు సాఫ్ట్‌వేర్ సమస్యలు




హైదరాబాద్‌మార్చి28(జర్నలిస్ట్ వార్త): ఎల్ఆర్ఎస్ సాఫ్ట్‌వేర్‌లో సమస్యలు తలెత్తుతుండడంతో ప్రజలు ఇ బ్బందులు పడుతున్నారు. ఈ సమస్యలపై పలు జిల్లాల నుంచి ప్రభుత్వానికి భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఉమ్మడి వరంగల్, నల్లగొండ, రంగారెడ్డి, మేడ్చల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి ఈ సాఫ్ట్‌వేర్ సమస్యలు ఎక్కువగా వస్తున్నట్టుగా తెలిసింది. దీంతోపాటు ఎల్ఆర్ఎస్ ఫీజుల చెల్లింపులో కూడా భారీగా వ్యత్యాసా లు వస్తున్నాయని, దీంతోపాటు ప్లాట్ల వెరిఫేకషన్ పే రుతో కొందరు మున్సిపల్ సిబ్బంది డబ్బులు డి మాండ్ చేస్తున్నారని పురపాలక శాఖకు ఫిర్యాదు లు అందినట్టుగా తెలిసింది. ఈ సమస్యలతో పా టు ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారి లో చాలామందికి ఇప్పటివరకు ఎలాంటి మేసెజ్ లు రాలేదని, కనీసం దాని గురించి తెలుసుకోవడానికి వెళ్లినా మున్సిపల్ ఆఫీసుల్లో ఎలాంటి స మాచారం లభించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈనెల 31వ తేదీతో ఎల్ఆర్ఎస్ ఫీజు రా యితీ గడువు ముగుస్తుండడంతో దీనిని పొడిగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ సమస్యలతో ఫీజులు చెల్లించలేని వారి పరిస్థితి ఏమిటన్నది ఇంకా ఆగమ్యగోచరంగా మారింది.

దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వే చి చూడాల్సిందే. ముఖ్యంగా వెంచర్‌లలో పక్కపక్కన ప్లాట్లకు ఫీజు చెల్లింపుల్లో భారీగా తేడాలు వ స్తున్నాయని, దీనివల్ల లక్ష నుంచి కోట్ల రూపాయాల ఫీజును చెల్లించాలని నోటీసుల్లో పేర్కొంటున్నారని, ఇలా అయితే తాము ఎలా ఫీజును చెల్లిస్తామని ఆయా ప్లాట్ల యజమానులు ప్రశ్నిస్తున్నారు. ఇది సాఫ్ట్‌వేర్ సమస్య అని మున్సిపల్ అధికారులు పేర్కొంటున్నారని, ఇప్పటికే ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని అధికారులు పేర్కొంటుండడం విశేషం. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు ఆటోమెటిక్‌గా సాఫ్ట్‌వేర్ ఫీజును ఖరారు చేస్తుందని, అందులో తమ ప్రమేయం ఏమీ ఉండదని అధికారులు పేర్కొంటున్నారు. ఎక్కువ ఫీజు చెల్లించాలని మున్సిపల్ శాఖ ఇచ్చిన నోటీసులపై బాధితులు గ్రీవెన్స్‌సెల్‌కు కాల్ చేస్తే ఆ నంబర్ పనిచేయడం లేదని బాధితులు వాపోతున్నారు. దీంతో కొందరు నేరుగా ఆయా మున్సిపాలిటీల్లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తుండడం విశేషం.

# వేసవి ఎండలతో తాగునీటి సరఫరాపై దృష్టి

## అధికారులతో సమీక్షించిన మంత్రి నారాయణ



అమరావతి,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
ఎండలు దంచికొడుతున్నాయి.. రికార్డుస్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.. దీంతో, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై ఫోకస్ పెట్టింది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.. మరోవైపు.. మున్సిపాలిటీల్లో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పై మంత్రి నారాయణ దృష్టిసారించారు.. తాగు నీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు..వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి ఎద్దడి లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి నారాయణ సూచించారు.. తాగు నీరు సరఫరాలో ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు.. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు, అన్ని మున్సిపాలిటీల కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.. మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, డైరెక్టర్ సంపత్ కుమార్, ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న తదితరులు పాల్గొన్నారు.. వారంలో మూడు సార్లు డ్రింకింగ్ వాటర్ సరఫరాపై సమీక్ష చేస్తానని వెల్లడించారు మంత్రి నారాయణ.. శివారు ప్రాంతాలకు కూడా అవసరమైన మేర డ్రింకింగ్ వాటర్ స్లపై చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.. పారిశుధ్యం పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.. చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు మంత్రి నారాయణ..

# ఇక టూవీలర్‌దారులకు రెండు హెల్మెట్లు

## బండి కొనేప్పడే అంటగట్టే ఆలోచన

న్యూఢిల్లీమార్చి28(జర్నలిస్ట్ వార్త):
దేశంలో నిరంతరం రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు, వాహనదారుల ప్రాణాలను కాపాడేందుకు భారత ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తూనే ఉంది. ఈ క్రమంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు కొన్ని మార్పులను కూడా తీసుకొస్తోంది. కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కర్ కొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. దీని ప్రకారం ఇకపై దేశంలో టూవీలర్లను ఖచ్చితంగా ఐఎస్ఐ సర్టిఫికేషన్ కలిగిన రెండు హెల్మెంట్లతో కలిపి విక్రయించాలని పేర్కొన్నారు. ఇదే అమలులోకి వస్తే ద్విచక్రవాహం కొనే వ్యక్తులకు బండి డెలివరీతో పాటు- రెండు హెల్మెట్లు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందిజ కేంద్ర మంత్రి గడ్కరీ ఈ విషయాన్ని దిల్లీలో జరిగిన ఆటో సమ్మిట్ కార్యక్రమంలో మాట్లాడుతూ వెల్లడించారు. ఈ ప్రతిపాదనను దేశంలోని టూవీరల్స్ హెల్మెట్ తయారీదారుల అసోసియేషన్ స్వాగతించింది.రోడ్డు ప్రమాదాలను నివారించడానికి గడ్కరీ ఆదేశం కీలకమైనదిగా తెలుస్తోంది. దేశంలో చాలా కాలంగా ఎదుర్కొంటు-న్న రోడ్డు ప్రమాదాల్లో మరణాలను తగ్గించటానికి ఇది దోహదపడే చర్యగా ఆటో రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇదే క్రమంలో ఐఎస్ఐ నాణ్యతా ప్రమాణాలు కలిగిన హెల్మెంట్లను వాహనదారులు ఉపయోగించేలా ఇది ప్రేరేపిస్తుందని హెల్మెట్ తయారీదారుల సంఘం అభిప్రాయపడింది.

# జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదుకు నో

## పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీమార్చి28(జర్నలిస్ట్ వార్త):స్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ వ్యహహారంపై సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీ-విచారణ జరుపుతున్నందున ఈ దశలో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించలేమని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ వర్మ బదిలీని కేంద్ర నోటిఫై చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తన నివాసంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు కనిపించిన ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో మరీ కీలక పరిణామం చోటు చేసుకుంది. దీనిపై ఒకవైపు సీజేఐ ఏర్పాటు చేసిన కమిటీ విచారణ జరుపుతుండగానే, అలహాబాద్ హైకోర్టుకు ఆయనను బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారంనాడు నోటిఫై చేసింది. భారత రాజ్యాంగంలోని 222వ నిబంధనలోని క్లాజ్ వన్ ద్వారా రాష్ట్రపతి తనకు సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకుని భారత ప్రధాన న్యాయమూర్తితో సంప్రదింపులు జరిపి, ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలాహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలనే సిఫారసు ఆమోదించారని ఆ ఉత్తర్వు తెలిపింది. జస్టిస్ వర్మ అలాహాబాద్ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించినట్టు పేర్కొంది. జస్టిస్ వర్మపై ఆరోపణల దుమారం నేపథ్యంలో ఆయనను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేసింది. అయితే ఈ నిర్ణయంతో అలబాహాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ విభేదించింది. జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుతో సహా దేశంలోని ఏ కోర్టుకు బదిలీ చేయరాదని, ఆయనపై ఉన్న అభియోగాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరపాలని, అభిశంసన చేపట్టాలని, ఆయన పాత కేసుల్లో తీర్పులను కూడా తిరగదోడాలని హైకోర్ట్ బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది.

# 47 మార్కెట్ కమిటీలకు చైర్మన్ల ప్రకటన

అమరావతి,మార్చి28(జర్నలిస్ట్ వార్త):ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నామినేటెడ్ పోస్టుల భర్తీపై కూడా ఫోకస్ పెట్టింది.. ఇప్పటికే మెజార్టీ పదవుల్లో కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నేతలను కూర్చోబెట్టిన ప్రభుత్వం.. మరో 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రకటించింది.. 47 మార్కెట్ కమిటీలకు గాను మొత్తంగా సభ్యులతో కలిపి 705 నామినేటెడ్ పదవులు భర్తీ చేసింది. అభ్యర్థుల ఎంపికకు ప్రజాభిప్రాయ సేకరణ చేసి.. ఆ తర్వాత వారి పేర్లను ప్రకటించింది.. తాజాగా ప్రకటించిన 47 ఏఎంసీ ఛైర్మెన్ల పదవుల్లో 37 టీడీపీ నేతలకు, 8 జనసేన పార్టీ నేతలకు, 2 బీజేపీ నాయకులకు దక్కాయి. త్వరలోనే మిగిలిన మార్కెట్ కమిటీల ఛైర్మెన్లను ప్రకటించనుంది తెలుగుదేశం పార్టీ.. ఇక, కూటమి ప్రభుత్వం ప్రకటించిన 47 మార్కెట్ కమిటీ-లకు సంబంధించిన.. కమిటీలతో పాటు-.. కమిటీ- ఛైర్మన్‌గా ఎంపికైన నేతల పేర్లు.. వారు ఏ పార్టీకి చెందినవారు అనే విషయాన్ని జాబితాగా విడుదల చేశారు.

1 నరసుపల్లి వెంకటనాయుడు టీడీపీ
2 శ్రీమతి. కోదర్క కళావతి టీడీపీ
3 నర్సీపట్నం రుట్టాల శేఖర్ కుమార్ టీడీపీ
4 పలాస మూల శ్రీనివాసరావు టీడీపీ
5 రంపచోడవరం లోతా లక్ష్మణరావు టీడీపీ
6 సాలూరు ముట్యూరు సూర్య నారాయణ టీడీపీ
7 కొత్తవలస చొక్కాకుల మల్లా నాయుడు టీడీపీ
8 పశ్చిమ విశాఖపట్నం తోట శివ ప్రసాద్ టీడీపీ
9 పాలకొండ బిడ్డిక సంధ్యారాణి JSP
10 యలమంచిలి తట్ట లోవ కుమారి JSP
11 దెందులూరు గారెపాటి రామదాస్ టీడీపీ
12 ఏలూరు మామిళ్లపల్లి ప్రభు సారధి టీడీపీ
13 జగంపేట అడ్డాల భరత్ బాబు టీడీపీ
14 మండపేట చింతపల్లి రామకృష్ణ టీడీపీ
15 తణుకు కొండేటి శివ టీడీపీ
16 పిఠాపురం వాకాడ దేవిల్లి టిడిపి
17 కాకినాడ రూరల్ కరప ముద్రగడ రమేష్ టీడీపీ
18 గన్నవరం (ఎస్సీ) గన్నవరం వరుపుల పద్మ టీడీపీ
19 తాడేపల్లిగూడెం చాపల మంగ బాయి టీడీపీ
20 నరసాపురం ఎలమంచిలి భాస్కర్ టీడీపీ
21 గుడివాడ కావూరి ప్రసాద రావు టీడీపీ
22 బంటుమిల్లి వగ్రి శ్రీనివాస్ రెడ్డి టీడీపీ
23 గుడ్లవల్లేరు కాగిత కృష్ణారావు టీడీపీ
24 పామర్రు జె.అర్జునరావు టీడీపీ
25 మంగళగిరి జవది ఖాన్ చంద్ JSP
26 నర్సరావుపేట పత్తిపాటి శ్రీకాంత్ టీడీపీ
27 కనికపాడు కొమ్మాడి శేష రమేష్ కోటేశ్వరరావు టిడిపి
28 సత్తెనపల్లి కోట రామారావు JSP
29 గుంటూరు తోట లక్ష్మి ప్రసన్న టీడీపీ
30 మొవ్వ దోనేల వెంకట రెడ్డి టీడీపీ
31 పిడుగురాళ్ల తీగల శ్రీనివాస్ రెడ్డి టీడీపీ
32 బత్తుల వెంకటేశ్వర రెడ్డి టీడీపీ
33 నందిగామ రజనీ
34 నగరి డాక్టర్ రజనీ JSP
35 పీలేరు చుక్కా రమేష్ టీడీపీ
36 యర్రగొండపాలెం జి. ఆనంద్ కుమార్ టిడిపి
37 కనిగిరి కలిముత్తు టీడీపీ
38 GD నెల్లూరు శ్రీమతి. జి. లక్ష్మీదేవి JSP
39 హిందూపూర్ యు. అశ్వత నారాయణ రెడ్డి టీడీపీ
40 కళ్యాణదుర్గం లక్ష్మి JSP
41 రాయదుర్గం బి. లక్ష్మీదేవి JSP
42 అనంతపురం అర్బన్ గుర్రం గారి వెంకట రవీంద్ర టీడీపీ
43 పెనుకొండ అంగల బాబు టీడీపీ
44 పుట్టపర్తి సుంకర లక్ష్మి టీడీపీ
45 కదిరి నాజా సాహెబ్ బి.జె.పి
46 పత్తికొండ నాజా సాహెబ్ BJP
47 ధర్మవరం కురివ మలిలమ్మ టీడీపీ

# ఎంజాయిబుల్ ఎడ్యుకేషన్... లోకేష్ 'నో బ్యాగ్ డే' కీలక లక్ష్యాలివే!

అమరావతి,మార్చి28(జర్నలిస్ట్ వార్త):
బరువైన బ్యాగులు.. బ్యాగుల నిండా పుస్తకాలు.. చూసేవారికి వెళ్తోంది చదువుకోవడానికేనా అనే సందేహాలు.. ర్యాంకుల వేటలో ఈ పుస్తకాల మోతతో.. మస్తిష్కానికి పుస్తకం తప్ప మరో ఆలోచన లేని పరిస్థితులు.. దీంతో బాల్యం అంటే పుస్తకాలు, మార్కులు తప్ప మరొకటి లేకుండా గడిచిపోతున్న వ్యవహారాలు.. ఈ సమయంలోనే ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కీలక నిర్ణయం తీసుకున్నారు.

బాల్యం అంటే.. కేవలం పుస్తకాల మోత మాత్రమే కాదని.. ఆ మోతలకు, రొటీన్ ఆలోచనలకు స్వస్థి పలికేలా అడుగులు వేశారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు బ్యాగుల మోత తప్పించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగానే... నో బ్యాగ్ డే అమలు చేస్తోన్నారు. దీనివల్ల... నెలలో ఒక్క రోజైనా బ్యాగు లేకుండా స్కూలుకు వెళ్లి.. సరికొత్త విషయాలపై అవగాహన, ఆసక్తికి పెంచుకునేలా చేస్తున్నారు.

ఈ క్రమంలోనే ప్రతి నెలా మూడో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లో నో బ్యాగ్ డే అమలు చేస్తున్నారు. ఈ సమయంలో ఏపీ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. నెలలో ఒక రోజు కాదు.. వారంలో ఒకరోజు కచ్చితంగా కేవలం పాఠ్యపుస్తకాల చదువులు మాత్రమే కాకుండా.. ఎన్నో విషయాలపై విద్యార్థి దశలో అవగాహన, ఆసక్తి పెంచుకునేలా ఆలోచన చేశారు. ఈ విషయాన్ని ఇటీవల ఎక్స్ లో వెల్లడించారు.

ఇందులో భాగంగా... ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సమగ్ర వికాసం లక్ష్యంగా ఎన్నో చర్యలు తీసుకుంటున్నామని.. ఇప్పటివరకు మూడో శనివారం మాత్రమే ఉన్న నో బ్యాగ్ డేని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రతి శనివారం అమలుచేస్తామని.. ఆ రోజు విద్యార్థులకు క్విజ్ లు, సమకాలీన అంశాలపై డిబేట్లు, సదస్సులు, క్రీడలు, వివిధ పోటీలు నిర్వహిస్తామని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.

మరోవైపు... పాఠశాల విద్యలో సమగ్ర సంస్కరణలతో లోకేష్ దూసుకుపోతున్నారనే చర్చ వినిపిస్తోంది. ఈ రకమైన



చొరవ విద్యార్థులను స్కిల్ టెస్ట్స్, స్పోకెన్ ఇంగ్లిష్, స్పెల్ బీ పోటీలు, వృత్తి విద్య, లలిత కళలు, ప్రదర్శన కళలు, మార్క్ పార్లమెంట్ సెక్షన్స్ మొదలైనవాటికి అవసరమైన నైపుణ్యాలతో సన్నంధం చేయడం ఏపీ విద్యాశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. నో బ్యాగ్ డే నాడు ఇవన్నీ అమలుచేయనుంది. ఇదే సమయంలో... పాఠాంశాల్లో వృత్తి విద్యను చేర్చడం జరుగుతుంది. దీనివల్ల విద్యార్థులకు వివిధ చేతిపనులలో ఆచరణాత్మక అనుభవం లభిస్తుంది. అదేవిధంగా.. ప్రత్యేక విద్యావేత్తలు, కెరీర్ %డ% మానసిక ఆరోగ్య సలహాదారులు సామాజిక పరస్పర చర్య, నైపుణ్యాలను పెంపొందించడానికి రూపొందించిన పలు వినోద ఆటలతో కార్యకాలాపాలను నిర్వహిస్తారు.అదేవిధంగా... కేవలం విద్య మాత్రమే కాదు, ప్రతీ విద్యార్థికి నైతిక విలువలు కూడా నేర్పించాలని ఏపీ ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు మార్గదర్శకాలను అనుసరించి విలువ ఆధారిత విద్యాసెషన్స్ వల్ల విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందిస్తాయి. ఇవి వారికెంతగానో ఉపయోగపడతాయి.వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పలు ఏకపక్ష విధానాల కారణంగా.. లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి తప్పుకున్న పరిస్థితి. వీటికి సంబంధించిన గణాంకాలు ఇప్పటికే లోకేష్ ఏపీ అసెంబ్లీలో వెల్లడించారు! ఈ క్రమంలో... వరుసగా రెండు నుంచి మూడు నెలలు విద్యార్థులు గైర్హాజరైతే.. వారి వివరాలను డ్రాప్ బాక్స్ లో ఉంచారు.

ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 5,94,863 మంది విద్యార్థుల పేర్లను ఈ డ్రాప్ బాక్స్ లో నమోదు చేశారు. అయితే.. 10వ తరగతి ఫెయిల్, ఐటీఐ, పాలిటెక్నిక్ లలో ఉన్న విద్యార్థులను మినహాయించి గత విద్యా సంవత్సరంలో డ్రాప్ అవుట్ అయినవారి సంఖ్య 4,85,662గా తేలింది. ఇదే సమయంలో ఆర్థిక ఇబ్బందులు కూడా ఈ డ్రాప్ అవుట్స్ కి కారణం అని తేలింది.'అమ్మ ఒడి' అమలు చేశామని, సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా చేశామని చెప్పే గత ప్రభుత్వ హయాంలో 1,75,254 మంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా డ్రాప్ అవుట్ అయ్యారనే లెక్కలు చెబుతున్నాయి! ఈ క్రమంలో... తాజా పరిశోధనల్లో 6,178 మంది విద్యార్థులు మరణించినప్పటికీ వారి పేర్లు డ్రాప్ బాక్స్ లోనే ఉన్నాయని చెబుతున్నారు.

ఇదే సమయంలో... తల్లితండ్రులు వలసల కారణం 82,103 మంది, అనాథలకు సరైన ఆశ్రయం లేక 1,632 మంది వారి విద్యను కొనసాగించలేకపోయారు. దీనికితోడు సమీపంలో పాఠశాలలు లేకపోవడం, తగినంత రవాణా సౌకర్యాలు లేకపోవడం వల్ల 44,818 మంది విద్యార్థులు చదువు మానేశారు.

ఈ నేపథ్యంలోనే నారా లోకేష్ నో బ్యాగ్ డే కి.. విద్యా అభివృద్ధితో పాటు ప్రతీ వారం విద్యార్థులకు సంతృప్తికరమైన, ఆకర్షణీయమైన అనుభవాన్ని అందించడం లక్ష్యంగా చేసుకుంది. అయితే... ఇది ప్రారంభం మాత్రమే.. రాబోయే రోజుల్లో విద్యా వ్యవస్థలో సమూల మార్పులతో లోకేష్ ముందుకు రాబోతున్నారని తెలుస్తోంది. ఈ వేగవంతమైన సాంకేతిక పోటీ ప్రపంచంలో.. విద్యార్థుల భవిష్యత్తును అద్భుతంగా రూపొందించడానికి ఏపీ విద్యాశాఖ మంత్రి అపూరుపమైన కృషిని, సమయాన్ని అంకితం చేస్తున్నారనే చెప్పాలి.

# భద్రకాళి ఆలయానికి మట్టి కుండల సమర్పణ



**వరంగల్/మార్చి28(జర్నలిస్ట్ వార్త):** ఉగాది కొత్త సంవత్సరం పురస్కరించుకుని భద్రకాళి దేవస్థానంలో తెలంగాణ శాలివాహన (కుమ్మరి) సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆవునూరి రాంమూర్తి ప్రజాపతి నేతృత్వంలో శుక్రవారం మట్టితో తయారు చేసిన కొత్త కుండలను ఆలయానికి సమర్పించారు. వారి వెంట జిల్లా అధ్యక్షులు రుద్రారపు కుమారస్వామి ప్రజాపతి, గౌరవ అధ్యక్షులు ఆవునూరి నాగరాజు ప్రజాపతి, కోశాధికారి అవునూరి భాస్కర్ ప్రజాపతి, గోపన్నపల్లి శాలివాహన సంఘం సభ్యులు నాంపెల్లి రాజేష్ ప్రజాపతి, నాంపెల్లి బిక్షపతి ప్రజాపతి, నాంపెల్లి అన్నయ్య ప్రజాపతి, తౌటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ విగ్రహాలకు 3 లక్షల రూపాయల విరాళం



**పర్వతగిరి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండలం వడ్లకొండ గ్రామంలోని రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా సీతారామచంద్ర స్వామి దేవాలయం నిర్మించారు. శుక్రవారం విగ్రహాలకు గాను తోపుచెర్ల సావిత్రి రామారావు కుమారులు వేణు గోపాల్ రావు-శ్వేత, అనిల్ రావు-సునీత, ప్రవీణ్ రావు-చందన దంపతులు 3,01,116 రూపాయల విరాళం కమిటీ సభ్యులకు అందించారు. వారి వెంట సభ్యులు అమడగాని రాజు యాదవ్, స్వామిరావు, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# హన్మకొండలో టాటూగ్యాంగ్ హల్‌చల్

**భారీ దోపిడీకి పక్కా స్కేచ్.. ఓ ఇంట్లో భారీ దోపిడీ**

**సీసీ కెమెరాల ఆధారంగా పోలీసుల దర్యాప్తు**

**అంతర్రాష్ట్ర ముఠా పనేనని అనుమానాలు**

వరంగల్, మార్చి28(జర్నలిస్ట్ వార్త):
వరంగల్‌లో "టాటూ గ్యాంగ్".. భారీ దోపిడీలకు పక్కా ప్లాన్‌తో రంగంలోకి దిగిన ఈ ముఠా టార్గెట్ చేసింది.. విశాలంగా ఉంటే ధనవంతుల ఇళ్లను టార్గెట్ చేసి లూటీలకు బరితెగిస్తోంది.. తాజాగా హనుమకొండ పరిధిలోని ఓ ఇంట్లో భారీదోపిడీకి ప్రయత్నం చేశారు.. అదృష్టవశాత్తు ఆ ఇంట్లో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.. సీసీ కెమెరా ఫుటేజ్ చూసి షేక్ అయిన పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నారు.. హనుమకొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యారణ్యపురిలో జరిగిన రాబరీ నగరమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది..సీసీ కెమెరా ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు.. ఈ దోపిడికి పాల్పడిన ముఠా మామూలు దొంగలు కాదని కరడుగట్టిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా అని గుర్తించారు.. మొత్తం ఆరుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దోపిడీలకు పాల్పడ్డారు.. వాళ్ళ ఒంటిపై ప్రతి ఒక్కరి ఎడమ చేతిపై పచ్చబొట్టు, చేతిలో మారణాయుధాలు కలిగి ఉండడం చూసి ఇదేదో డిఫరెంట్ డేంజర్ గ్యాంగ్‌గా భావిస్తున్నారు. విద్యారణ్యపురిలో దోపిడీకి పాల్పడిన ఈ ముఠా ఆ ఇంటి కిటికీ గ్రిల్స్ ధ్వంసంచేసి ఇంట్లోకి ప్రవేశించారు.. విలువైన వస్తువులు దొంగిలించారు.. సీసీ కెమెరాల్లో వాళ్ల దోపిడి దృశ్యాలు అంతా రికార్డయ్యాయి. అర్ధరాత్రి దోపిడికి పాల్పడిన ముఠా రెండున్నర గంటలపాటు ఆ ఇంట్లోనే గడిపినట్టుగా సీసీ కెమెరా ఫుటేజ్‌లో లభ్యమైన ఆధారాలను బట్టి పోలీసులు గుర్తించారు.. ఈ ముఠా ఇంట్లోకి ప్రవేశించిన సమయంలో ఆ ఇంట్లోని వారు గాఢ నిద్రలో ఉన్నారు. ఎవరు నిద్రలేచి ప్రతిఘటించకపోవడంతో అంతా ప్రాణాలతో బయటపడ్డారు.. లేకపోతే ఊహించిన విధంగా ప్రాణనష్టం జరిగి ఉండేదని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ దోపిడీ ఘటన జరిగి 24 గంటల వ్యవధిలో వాళ్ళు ఇంకా సిటీ దాటి వెళ్ళలేదని పోలీసు నిఘా వర్గాలు, టీమ్స్ గుర్తించాయి.. ఆరు ప్రత్యేక బృందాలతో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ ముఠా వరంగల్ సిటీ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని.. కచ్చితంగా ఏదో ఒక దారుణానికి పాల్పడతారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎలాంటి ఘటనలు జరగకుండా ముందుగా అప్రమత్తమైన పోలీసులు.. నగర పరిసరాలన్నీ జల్లెడ పడుతున్నారు.. టాటూ దొంగల గురించి ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు.. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.. ఈ దొంగల గురించి ఏమైనా సమాచారం ఉంటే.. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నారు.

# ముస్లిం మత పెద్దలకు సన్మానం





తల్లాడ/మార్చి28(జర్నలిస్ట్ వార్త): తల్లాడలో మసీద్ పక్కన తరాబీ పూర్తయిన సందర్భంగా ముస్లిం సోదరులు శుక్రవారం ముస్లిం మత పెద్దలను, ఖురాన్ ను పఠనం చేసిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు అనాత్ మౌలానా, ముజీద్ మౌలి షాబ్ లను శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రంజాన్ పర్వదినం సందర్భంగా సుమారు నెలరోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, తరాబి పూర్తయిన సందర్భంగా సన్మానించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు షేక్ ఈసూబ్, సదర్ షేక్ మస్తాన్, నాయర్ సదర్ షేక్ మెహరాజ్, అక్బర్, మున్నా, నిజాం, బడే మియా, జాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



రాయపర్తి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):మండల కేంద్రంలోని బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయం ఆఫీస్ బాయ్ గా పనిచేస్తున్న మండల కేంద్రానికి చెందిన పిల్లి కృష్ణకాంత్ ప్రమాదవశాత్తు రిజర్వాయర్ కాలువలో పడి మృతిచెందగా బిఆర్ఎస్ నాయకులు నివాళులు అర్పించారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ అధినేత బిఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, కృష్ణ కాంత్ దహన సంస్కారాలకు 15,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని పౌండేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ లేత కుల రంగారెడ్డి చ్చే అందజేశారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డిమాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మాజీ సర్పంచ్ గారే నర్సయ్య,మాజీ ఎంపీటీసీ ఐత రాంచందర్,గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి చందు రాము యాదవ్,చందు సతీష్, కిషోర్, పూస కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి



రాయపర్తి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన రాయపర్తి మండల కేంద్రం లో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన పిల్లి కృష్ణ కాంత్(29)ఈనెల 25న చేపల వేటకు వెళ్లాడు. ఎంతకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తప్పి పోయాడని భావించి చుట్టూ ప్రక్కల, బంధువుల ఇండ్లలో వెతికారు.శుక్రవారం మండల కేంద్రం శివారులోని మైలారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కు వచ్చే నీటి కాలువలో కృష్ణకాంత్ డెడ్ బాడీ నీటిపై తేలియాడుతూ కనబడగా చుట్టూ ప్రక్కల రైతులు పూజారి సాగర్,కౌటం ఎల్లాస్వామి వెళ్లి చూడగా చేపల పట్టే వల చుట్టుకొని చనిపోయి ఉన్నాడు. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు కృష్ణకాంత్ డెడ్ బాడీ నీ చూసి కన్నీటి పర్యంతమయ్యారు.మృతుని తల్లి పిల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పంచనా మాకు తరలించినట్లు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

# ప్రస్తుత కాలంలో బాలికల ఆత్మరక్షణ కరాటే విద్య చాలా ముఖ్యం





సత్తుపల్లి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):
ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం శ్రీకారం చుట్టిన రాణి ఝాన్సీ లక్ష్మీబాయి ఆత్మరక్షణ లోభాగంగా కరాటే శిక్షణ చాలా ముఖ్యం అని అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 7తరగతి నుండి పదవ తరగతి బాలికలకు పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. ఈ రోజు తో తుంబూరు పాఠశాలలో ముగింపు కార్యక్రమం జరిగిందని కరాటే విద్య శిక్షకులు భాస్కరా చారి తెలిపారు.మూడు నెలలు పాటు వారం లో రెండు రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది, ఈ శిక్షణ కు గౌరవ వేతనం గా రూ.15000 ఇవ్వడం జరుగుతుంది.కరాటే శిక్షణ లో ఆత్మ రక్షణ లో భాగంగా పంచ్ లు,డిఫెన్స్, ఆపెన్స్, కటాష్ , ఫైటింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది, దీనివల్ల బాలికల లో ఆత్మస్థయిర్యం, ఏకాగ్రత, బాడీ లో అన్ని అవయవాలలో రక్త ప్రసరణ వ్యవస్థ సక్రమంగా పనిచేసి అనారోగ్య సమస్యలు తగ్గుముఖం పడతాయి. భవిష్యత్ లో ఎదురయ్యే భౌతిక మానసిక దాడులను ఎదుర్కొనేదుకు సహాయపడుతుంది అని తెలిపారు. ఈ సందర్భంగా ఈ రోజు తుంబూర్ హై స్కూల్ లో కరాటే శిక్షణ ముగింపు కార్యక్రమాలను నిర్వహించటం జరిగింది. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమం లో కరాటే మాస్టర్ పిచ్చయ్య, శిక్షకులు భాస్కరాచారి,ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలకు అందిస్తున్న విరాళాలు



గణపురం/మార్చి28(జర్నలిస్ట్ వార్త):
గణపురం మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఉద్దేశంతో గణపురం మండల కేంద్రానికి చెందిన అశోక్ ఫోటోగ్రఫీ నిర్వాహకులు దండగుల అశోక్ 50 కేజీల బియ్యాన్ని కర్షక్ పెట్లేజర్స్ నిర్వాహకులు దేశముఖ ప్రదీప్ 100 కేజీల బియ్యాన్ని హరిహర దస్తావేజ లేఖరి నిర్వాహకులు తాళ్లపల్లి పావని నిరంజన్ గౌడ్ 25 కేజీల బియ్యాన్ని దాము కిరాణం నిర్వాహకులు 10 లీటర్ల వంటనూనెను అదేవిధంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా గాజర్ల రఘుపతి కీర్తిశేషులు వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు గాజర్ల రాజు ( చింటూ ) 5.116 రూపాయలు ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్ గౌడ్ కి అందజేయడం జరిగింది అదేవిధంగా దండగుల అశోక్ మాట్లాడుతూ గణపురం మండల కేంద్రంలోని రామాలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకి నా వంతుగా స్వామివారికి పూలమాలను తీసుకుంటానని చెప్పారు అదేవిధంగా ఆలయ అభివృద్ధికి భక్తులు అధిక సంఖ్యలో విరాళాలను అందజేయడం హర్షం వ్యక్తం చేస్తారు ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ముఖ్య ఉద్దేశం

**- భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే**




**భూపాలపల్లి/మార్చి28(జనలిస్ట్ వార్త):**
సద్గునాలను పెంపొందించడమే రంజాన్ మాస ముఖ్య ఉద్దేశమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పట్టణ ముస్లిం పెద్దలు, పోలీసు ముస్లిం ఉద్యోగులకు ఎస్పీ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా
ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణ, దాతృత్వం కలయికే రంజాన్ మాసం అన్నారు. రంజాన్ మాసం అందరిలో సోదర భావం పెంపొందిస్తుందని, ఈ మాసంలో ప్రతి ఒక్కరికి మంచి జరగాలని ఎస్పీ కిరణ్ ఖరే ఆకాంక్షించారు.అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక రంజాన్ మాసం అని, సర్వ మతాల సారం ఒకటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన, ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ సోదరా భావం, మానవత్వం పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డిఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, డిటిఓ సందాని, జిల్లా పరిధిలోని సిఐలు ఎస్సైలు, పట్టణ ముస్లిం పెద్దలు, పోలీసు ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు.

# తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి






తల్లాడ/మార్చి28(జర్నలిస్ట్ వార్త):తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సత్తుపల్లి నియోజకవర్గం టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు నారపోగు ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో నేడు జరుగబోయే తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) స్థాపించిన తెలుగుదేశం పార్టీకి మరల తిరిగి తెలంగాణలో పూర్వవైభవం తీసుకొచ్చేందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.గ్రామాలలో నిర్మించిన పార్టీ దిమ్మెలకు రంగులు వేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు ఈ సందర్భంగా మి మీ గ్రామాలలో సేవా కార్యక్రమాలు జరుపలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మొక్క కృష్ణార్జునరావ్ సరికొండ శ్రీనివాసరాజు ,ఎండి బాబు, వేముల గోవిందు ఉన్నారు.

# ఆగిన్న వాహనం డీ కొట్టిన అశోక్ లీలాండ్








సత్తుపల్లి/మార్చి 28(జర్నలిస్టు వార్త): తెల్లవారుజామున అతివేగంగా వస్తూ ఆగిన్న వాహనాలను అశోక్ లేలండ్ వాహనం డీ కొట్టిన ఘటన సత్తుపల్లి పట్టణం లో తెల్లవారుజామున జరిగింది. పోలీస్ లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్సెల్స్ డెలివరీ చేసి ఖమ్మం వెళ్తున్న వాహనం పాత సెంటర్ వద్ద రెడ్ బక్కెట్ బిర్యాని హోటల్ వద్దకు రాగానే రోడ్డు పక్కన నిలిపి ఉంచిన నాలుగు ద్విచక్ర వాహనాల పైకి దూసుకెళ్లింది. ద్విచక్ర వాహనాలు పూర్తిగా ధ్వంసమవ్వగా ప్రాణ హాని జరగక పోవడం తో ఊపిరి పిల్చుకున్నారు. అందులోనూ తెల్లవారు జామున కావడం రద్దీ కూడా తక్కువగా ఉండడం వలన పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో వాహనాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి.

# దొంతి మాధవరెడ్డి కి మంత్రి పదవి కేటాయించాలి

## టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్

నర్సంపేట/మార్చి28(జర్నలిస్ట్ వార్త): దొంతి మాధవరెడ్డి కి మంత్రి పదవి కేటాయించాలని టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ అన్నారు. శుక్రవారం నాడు టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ నర్సంపేటలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎన్నోవ్యాయ ప్రయాసాలు ఒడిదుడుకులను అనుభవిస్తూ నర్సంపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని అన్నారు.నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామ సర్పంచిగా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి సొసైటీ చైర్మన్ గా డిసిసిబి చైర్మన్ గా ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేసి పిసిసి సభ్యులుగా ఏఐసీసీ సభ్యులుగా పదవులు చేపట్టి నిబంధత క్రమశిక్షణ కమిట్మెంట్ కు మారుపేరుగా నిలిచరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం జీవితాన్ని దార పోసి పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి రాష్ట్ర నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో పనిచేస్తూ వారు చేపట్టిన పాదయాత్రలో చురుకైన పాత్ర పోషించారని తెలిపారు.2004 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ టిఆర్ఎస్ పార్టీల పొత్తులో భాగంగా నర్సంపేట టికెట్ టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంభంపాటి లక్ష్మారెడ్డికి టికెట్ కేటాయించితే కలత చెందకుండా కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను ఏకతాటిపై నడిపించరన్నారు.లక్ష్మారెడ్డి గెలుపులో కీలక పాత్ర పోషించాడని 2009లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి కొద్దిపాటి తేడాతో ఓటమి చెందినప్పటికీ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తూ వచ్చారని 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దొంతి మాధవరెడ్డి కి టికెట్ కేటాయించకుండా మోసం చేస్తే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మరియు నియోజకవర్గ ప్రజల బలమైన కోరికతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి నూతనంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ఏకైక స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొంది



రాష్ట్రవ్యాప్తంగా దొంతి మాధవరెడ్డి ప్రభంజనం సృష్టించారని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు నీతిమాలిన రాజకీయాలు చేస్తూ పదవుల కోసం జంపుజిలానిలుగా మరి టిఆర్ఎస్ పార్టీలో కిరాయిప్పులకు పాల్పడుతుంటే అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు స్వతంత్ర ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని టిఆర్ఎస్ పార్టీకి ఆహ్వానించినప్పటికీ మంత్రి పదవి ఇస్తామని కోట్ల రూపాయల కాంట్రాక్టులు ఆఫర్లు చేసిన ఆశపడకుండా కాంగ్రెస్ పార్టీని వీడకుండా మాతృ పార్టీపై ప్రేమతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో ఢిల్లీలో చేరి తన రాజకీయ నిబద్ధతను చాటుకోవడం జరిగిందని గుర్తు చేశారు 2014 నుండి 2018 వరకు ఎమ్మెల్యేగా నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడి పని చేస్తూ అప్పటి అధికార పార్టీ ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేసిన నిఖర్సగా ఎదుర్కొంటూ కాంగ్రెస్ పార్టీని కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన గొప్ప గొప్ప నాయకుడు దొంతి మాధవరెడ్డి 2018 ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షులు కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ప్రజా చైతన్య బస్సు యాత్రను ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ముందుండి నిర్వహిస్తూ ముందుకు నడపారన్న విషయాన్ని గుర్తు చేశారు 2018 ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓడిపోయినప్పటికీ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పార్టీ కోసం నిలబడే వ్యక్తిగా గుర్తింపు పొందిన నాయకుడని దాదాపు నర్సంపేట నియోజకవర్గం ఏర్పడి 45 ఏళ్ల చరిత్రలో చేతి గుర్తుపై గెలిచిన దాఖలాలు లేకపోగా మొదటిసారి నర్సంపేట గడ్డపై కాంగ్రెస్ పార్టీ చేతి గుర్తుపై గెలిచి చరిత్ర తిరిగరాశాడన్నారు కానీ తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ అధిష్టానం పార్టీలు ఫిరాయింపులు చేసిన వారికి కొత్తగా వివిధ పార్టీల నుండి పదవుల కోసం పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవులను ఇవ్వడం వరంగల్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడిగా ఉండి కాంగ్రెస్ పార్టీ కోసం ఎన్నో త్యాగాలు చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ని గుర్తించి మంత్రి పదవి ఇవ్వకుండా వరంగల్ ఉమ్మడి జిల్లా అదేవిధంగా నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ క్యాడర్ ను నిరాశకు గురి చేయడం సరికాదని వారు అన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వంలో భర్తీ చేయనున్న మంత్రి పదవుల్లో రాజకీయ నిబద్ధతకు నిదర్శనం సీనియార్టీ సమర్థత అధికారంలో ఉన్న లేకపోయినా కార్యకర్తలను పార్టీని కంటికిరెప్పలా కాపాడుకునే ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి మంత్రి పదవిని కట్టబెట్టి కాంగ్రెస్ పార్టీ వీడకుండా టిఆర్ఎస్ పార్టీ ప్రలోభాలకు లొంగకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన నాటి త్యాగాన్ని గుర్తించి మంత్రి పదవి ఇచ్చి గౌరవించి కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన వారికి న్యాయం జరుగుతుందని రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి పనిచేసిన ప్రతి నాయకుడికి న్యాయం చేకూరుతుందనే నమ్మకాన్ని కల్పించడంతో పాటు పార్టీని నమ్ముకుని దశాబ్ద కాలంగా పార్టీ కోసం ప్రజల కోసం నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేసిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కి మంత్రి పదవి ఇచ్చి నర్సంపేటకు మంత్రి పదవి వస్తుందని ఎదురు చూస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు న్యాయం చేయాలని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కు విజ్ఞప్తి చేయడం జరుగుతుందని అన్నారు.

# నూతన కమిటీని ఏర్పాటు చేసి పోచమ్మ గుడి నిర్మాణ పనులు చేపట్టాలి

## -మాదాసు మొగిలి గౌడ్, గ్రామస్థుడు







గణపురం/మార్చి28(జర్నలిస్ట్ వార్త): గణపురం మండల కేంద్రంలో ఉన్న పోచమ్మతల్లి గుడి పూర్తిగా శిథిలావస్థకు చేరిందని తక్షణమే గుడి నిర్మాణ పనులు చేపట్టాలని మాదాసు మొగిలి గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో పోచమ్మ తల్లి వద్దకు మొక్కులు చెల్లించుకునేందుకు వెళితే మహిళలు, చిన్నా, పెద్దలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. గుడి పూర్తిగా శిథిలామైందని గత రెండేళ్ళ క్రితం పోచమ్మ తల్లి ఆలయం నిర్మించేందుకు అన్ని కుల సంఘాలు, రాజకీయ నాయకులు, గ్రామ పుర ప్రముఖులు, యువత ఆధ్వర్యంలో గుడి నిర్మాణ కమిటీ వేసి విరాళాలు భారీగా వసూలు చేశారు. రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆ పనుల ఊసే ఎత్తడం లేదని, ఫోటోలు వాట్సాప్ గ్రూప్ లో మెసేజ్ లతో సరిపెట్టారు కానీ పనులు మొదలు పెట్టడం లేదు. కనీసం ఒక్క రోజు కూడా మీటింగ్ పెట్టి కార్యాచరణ తెలుపడం లేదన్నారు. గ్రామస్థుల అందరి మదిలో ఈవిషయమే మెదులుతున్న ప్రశ్నించేందుకు ఎవరు సహసించడం లేదన్నారు. కమిటీ వేసిన గ్రామ పంచాయతీ ఆవరణలోనే మళ్ళీ మీటింగ్ పెట్టి కమిటీ అసలు పనిచేస్తుందో లేదో తెలుపాలని డిమాండ్ చేశారు. కమిటీ వసూలు చేసి డబ్బుల వివరాలు సభలో తెలిపి వారు పనిచేయకుంటే తక్షణమే నూతన కమిటీని ఎన్నుకుని గుడి నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

## - కాంగ్రెస్ గ్రామపార్టీ అధ్యక్షులు కనకయ్య యాదవ్



పర్వతగిరి/మార్చి28(జర్నలిస్ట్ వార్త): పర్వతగిరి మండల పైలెట్ ప్రాజెక్టుకు జమాల్ పురం గ్రామం ఎంపికైన సంగతి తెలిసిందే. శుక్రవారం జమాల్ పురం గ్రామానికి చెందిన ల్యాదెల్ల హేమంత్ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు జున్ను కనకయ్య యాదవ్ ముగ్గుపోసి, భూమిపూజ నిర్వహించి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బాల్లె మల్లేశం, గోదారి నరేష్, భైరబోయిన సదయ్య, కారింగుల కిషన్, కార్యదర్శి దివ్య, అడ్డూరి సోమయ్య, బండి సారయ్య, గూడూరు సారంగపాణి, పిడుగు ఎల్లయ్య, పిడుగు రమేష్, కొల్లూరి సమ్మయ్య, ల్యాదెల్ల సదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పిడిఎఫ్ రైస్ దొంగల పట్టివేత

## -కేసును సేదించిన పోలీసులను అభినందించిన ఎసిపిరఘు.









**కల్లూరు/మార్చి28(జర్నలిస్ట్ వార్త):** మార్చి 16వ తేదీన చిన్న కోరుకొండి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు రేషన్ షాపు నుండి 180 బస్తాల రేషన్ బియ్యాన్ని దొంగలించడం జరిగిందనీ రేషన్ డీలర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు రేషన్ దొంగలను ఎట్టకేలకు పట్టుకుని బియ్యాన్ని రికవరీ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీ పి రఘు మాట్లాడుతూ వైరా మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన ఓర్స్ హనుమంతరావు, ఓర్సు కృష్ణ, దొర అనే వ్యక్తులు సులభ పద్ధతిలో డబ్బులు సంపాదించాలని లక్ష్యంతో చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని కొంటూ వ్యవస్థీకృత నేరాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో మార్చి 16న చిన్న కోరుకొండి గ్రామంలో చౌక దుకాణం నందు రేషన్ బియ్యాన్ని భద్రపరచడాన్ని గమనించి రాత్రికి రాత్రే 180 బస్తాలు బియ్యాన్ని దొంగలించారు.

ఈదొంగ తనానికి సహకారించిన దాసాపురం గ్రామానికి చెందిన ఉదయ్, చందు, గరిడేపల్లి జగదీష్ లను కూలికి మాట్లాడుకుని జగదీష్ వ్యాన్ డ్రైవర్ తో పాటు ఇంకొక వాహనం అశోక్ లేలాండ్ వ్యాన్ ద్వారా తరలించారు. గతంలో తమకు అక్రమ బియ్యాలకు మద్దతుగా ఉన్న ఎన్టీఆర్ జిల్లా నెమలి గ్రామానికి చెందిన కూరాకుల మురళి ఇంటి వద్ద 110 బస్తాలను గంపలగూడెం మండలం వినగడప గ్రామ శివారులో కోళ్ల ఫారం యజమాని కాంత రెడ్డికి 30 కింటాలను 50 వేల రూపాయలకు అమ్మి సొమ్ము చేసుకున్నారు అలాగే వత్సవాయి మండలం లింగాల గ్రామానికి చెందిన నర్సింహారావు అనే వ్యాపారికి 35 క్వింటాళ్ల బియ్యాన్ని 60 వేలకు అమ్మినట్లు వప్పుకున్నారు.

ఈ విషయాన్ని విశ్వసనీయ సమాచారం మేరకు సిఐ ముత్తు లింగయ్య,ఎస్సై డి.హరిత పోలీసు సిబ్బంది మార్చి 28వ తారీఖున నెమలి గ్రామంలోని కూరాకుల మురళి ఇంటి వద్ద ఉన్న బియ్యాన్ని స్వాధీన పరచుకోవడం జరిగింది, అక్కడే ఉన్న ఓర్సు హనుమంతు గరిడేపల్లి జగదీష్ సాయి నల్లబోతుల ఉదయ్ కూరాకుల మురళిలను అరెస్టు చేయడం జరిగింది. వారు వ్యసనాలకు ఖర్చుపెట్టగా మిగిలిన 30 వేల రూపాయలు 35 క్వింటాల రేషన్ బియ్యం ఒక అశోక లేలాండ్ వాహనం 110 కాళీ గోనెసంచులను జప్తు చేయడం జరిగింది. పరారీలో ఉన్న ఓర్సు దొర చందు, కాంతరెడ్డి నరసింహారావు కోసం ప్రత్యేక బృందంతో గాలింపు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రేషన్ బియ్యం దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిఐ ముత్తు లింగయ్య, ఎస్సై డి.హరిత, పోలీసు సిబ్బంది ని ఏసీబీ రఘు అభినందించి రివార్డులు అందజేశారు.ఈ కార్యక్రమం గురించి ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు అలవాటై నేరాలు చేసే వారిని ఉపేక్షించేది లేదని గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే పోలీసు వారికి సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు.

# తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## -తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొంతు భాస్కరరావు



ఖమ్మం/మార్చి28(జర్నలిస్ట్ వార్త): ఈనెల 29వ తేదీన తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని గ్రామ గ్రామాన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ఘనంగా నిర్వహించాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొంతు భాస్కరరావు కోరారు. నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) స్థాపించిన తెలుగుదేశం పార్టీకి మరల తిరిగి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు మనమందరం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు.గ్రామాలలో నిర్మించిన పార్టీ దిమ్మెలకు రంగులు వేయాలని కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా మి మీ గ్రామాలలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.

# అత్యంత శక్తిమంతుల జాబితాలో రేవంత్

## 100మందిలో28వ స్థానం

హైదరాబాద్:మార్చి28(జర్నలిస్ట్ వార్త): తన పరిపాల నా నైపుణ్యం ప్రభావంతమైన రాజకీయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత శక్తిమంతమైన నాయకుడిగా నిలిచారు. 'ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ 2025' సంవత్సరానికి సంబంధించి దేశంలోని వివిధ రంగాల్లో అత్యధిక శక్తిమంతులైన 100 మంది ప్రముఖులతో జాబితా వి డుదల చేసింది. ఈ జాబితాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 28వ స్థానం దక్కించుకున్నారు. 2024 సంవత్సరపు జాబితాలో 39 స్థానంలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడాది కాలంలోనే ఏకంగా 11 స్థానాలు ఎగబాకి 28వ స్థా నానికి చేరుకోవడం విశేషం. దేశంలో రాజకీ య, వ్యాపార, క్రీడా, వినోద రంగాల్లో అత్యం త ప్రభావవంతమైన వ్యక్తులు ఈ జాబితాలో ఉన్నారు. రాష్ట్ర పాలనలో తీసుకువచ్చిన మా ర్పులు, వ్యూహాత్మక రాజకీయ కార్యకలాపా లు,దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో పోషిస్తున్న ప్రముఖమైన పాత్రతో రేవంత్‌కు ఈ గు ర్తింపు లభించింది. తనదైనదూకుడుతో భారత రాజకీయాల్లో ఆయన చూపుతున్న ప్రభావం, నాయకత్వ లక్షణాలతో ఆయన ర్యాంకు మెరుగుపడింది. ఒక ప్రాంతీయ నాయకుడినే కాకుండా దేశంలోనే అత్యంత శక్తిమంతమైన, చురుకైన ముఖ్యమంత్రుల్లో ఒకరిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిర్భవించారు. ఈ జాబితాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇండియా కూటమిలోని ఇతర ప్రముఖులైన సిఎంల సరసన నిలిపింది. ప్రాంతీయ అవసరాలను జాతీయ ప్రాధాన్యతలతో సమన్వయం చేయగలిగిన మేధో సంపత్తి, వ్యూహాత్మక దృక్పథం రేవంత్ రెడ్డిని కీలక నాయకునిగా నిలిపేలా చేశాయి. శక్తిమంతులై వంద మంది జాబితాలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి 10 స్థానాల్లో ఉన్నారు.

# మృతురాలి కుటుంబానికి మార్నేని పరామర్శ



**పర్వతగిరి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):** మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ తక్కలపల్లి నారాయణరావు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి భాస్కర్ రావు మాతృమూర్తి సుభద్ర దేవి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమాచార తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు బాధిత కుటుంబాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మృతరాలికి నివాళులు అర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తపరిచారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు, బోయినపల్లి యుగంధర్ రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయకులు ఉన్నారు.

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శ**

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మేనత్త, వరంగల్ ఏనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తక్కలపల్లి నారాయణ రావు తల్లి తక్కలపల్లి సుభద్ర దేవి మృతి చెందారు. ఈ సందర్భంగా మృతురాలి బౌతిక దేహానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

**మాజీ ఎమ్మెల్యే అరూరి పరామర్శ**

పర్వతగిరి మండలం ఏనుగల్లు గ్రామంలో ఎర్రబెల్లి దయాకర్ రావు మేనత్త తక్కళ్లపల్లి సుభద్ర దేవి మృతిచెందగా వారి నివాసానికి వెల్లి ఆమె పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, వరంగల్ అర్బన్ కో-అపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే తక్కల్లపల్లి రాజేశ్వరరావు, బాల కిషన్ రావు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# ఇఫ్తార్ విందులతో సోదర భావం పెంపొందుతుంది

**-నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి.**



**రాయపర్తి/మార్చి 28(జర్నలిస్ట్ వార్త):**ఇఫ్తార్ విందులతో సోదర భావం పెంపొందుతుందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హనుమండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి అన్నారు.రంజాన్ పర్వదిన%శీ% సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని మస్జీద్- ఏ-నూర్ మసీద్ సదర్ సాబ్ మహమ్మద్ హుస్సేన్, మండలంలోని జగన్నాథపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు నంగునూరి అశోక్ లు ఏర్పాటు చేసిన ఇస్తార్ పాల్గొని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ మత సమర్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని అన్నారు.పవిత్ర రంజాన్ మాసంలో చిన్నపిల్లలకు మొదలుకొని పెద్దవారు దాకా కటోర నియమాలతో ఉపవాస దీక్షలు చేపట్టడం గొప్ప విషయం అన్నారు.రంజాన్ పండుగ ముస్లిం కుటుంబాలలో సంతోషాలు నింపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టిపీసీసీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జా హమ్యా నాయక్,మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి,వర్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి,మాజీ రైతు బంధు మండల అధ్యక్షుడు ఆకుల సురేందర్ రావు, బొమ్మెర కళ్యాణ్,ఎండీ అఫ్రోజ్,మాచర్ల ప్రభాకర్,మందాటి సుదర్శన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ సర్కార్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి





ఖమ్మం/మార్చి 28(జర్నలిస్టు వార్త):భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆదేశాలను అనుసరించి, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి పిలుపుమేరకు, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ నెల్లూరి కోటేశ్వరరావు, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన, ఖమ్మం జిల్లా కిసాన్ మార్చా అధ్యక్షులు శ్రీ చావా కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ ధర్నాచౌక్ యందు రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ రైతు సత్యాగ్రహ దీక్షకు ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి హాజరై ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చినటువంటి హామీలను వెంటనే అమలు చేయాలని చెప్పి అమలు చేయని పక్షంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ రైతాంగం పక్షాన రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటం ఉధృతం చేస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా రైతాంగం,సహచర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైస్ మిల్లు కార్మికుడు ఆత్మహత్య





**పెనుబల్లి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):**మండలంలోని అడవి మల్లెల గ్రామ పరిధిలోని బాయిల్డ్ రైస్ మిల్లులో బిహార్ రాష్ట్రానికి చెందిన కొందరు యువకులు పంచన్ కుమార్ అనే మేస్త్రి ద్వారా అమాలీలుగా పనిచేస్తున్నారు. అమాలి కార్మికులలో ఒకరైన రామ్ కుమార్ (21) మామిడి తోటలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.మిల్లు వెనక భాగంలో మామిడి తోటలో చెట్టుకి ఉరివేసుకొని కనిపించడంతో వి ఎం బంజర్ పోలీసులకు సమాచారం అందించారు. వీఎం బంజర్ ఎస్ ఐ కే.వెంకటేష్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి రామ్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. రైస్ మిల్లులలో మైనర్లుతో అమాలీలుగా పని చేయించుకుంటున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బీహార్ రాష్ట్రం కాగారియా జిల్లా జాంతా గ్రామానికి చెందిన రామ్ కుమార్ అనే యువకుడు 27 వ తేదీ మధ్యాహ్నం నుండి కనిపించకపోవడంతో కోదాడలో ఉన్న తన అన్న దగ్గరికి వెళ్లి ఉంటాడని తోటి అమాలీలు భావించారు. ఈ క్రమంలో 28 తారీఖున ఉదయం కోదాడలోని తన అన్నకు ఫోన్ చేసి రాంకుమార్ మీ వద్దకు చేరుకున్నాడా అని ఆరతీయగా రాలేదని తెలపడంతో తోటి ఆమాలీలు రైస్ మిల్లు చుట్టుపక్కల గాలించారు.

## దివ్య కారుణ్య దేవాలయంలో సిలువ మార్గ ప్రదర్శన



**తల్లాడ/మార్చి28(జర్నలిస్ట్ వార్త):** మండలంలో అన్నారు గూడెం గ్రామంలో దివ్య కారుణ్య దేవాలయ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు తపస్ కాల సిలువ మార్గ ప్రదర్శన నిర్వహించారు. ఏసుక్రీస్తు అనుభవించినటువంటి శ్రమలను స్మరించుకుంటూ పురవీధులలో సిలువ ప్రదర్శన చేశారు. అనంతరం ఉపవాస కూడిక దివ్య స్వప్రసాధన ఆరాధన దివ్య బలి పూజ సమర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తల్లాడ లూర్ధుమాత విచారణ రెవ. ఫాదర్ అజయ్. సహాయ ఫాదర్ ఫ్రాన్సిస్. ఫాదర్ మరియన్న. ఫాదర్ విన్సెట్. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తదనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో చారిటీ ట్రస్ట్ సిస్టర్స్. ఉపదేశికులు. జోజి. ఆంధ్రప సంఘ పెద్దలు నరసింహారావు. రామారావు. రఘు. సంఘస్తులు. ఏసు పాదం చిన్న కృష్ణయ్య. దేవయ్య కృష్ణ. విష్ణు. రవి. దీక్ష సహోదరి సహోదరులు సంఘస్తులు పాల్గొన్నారు.

# గ్రామస్తుల ఆలోచన చొరవతోనే విగ్రహం ఏర్పాటు

**-హాజరు కానున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు - జక్కంపూడి కిషోర్. జక్కంపూడి రాము**









**తల్లాడ/మార్చి28(జర్నలిస్ట్ వార్త):** మేము మా నాన్న విగ్రహాన్ని పొలంలో ఏర్పాటు చేయాలనుకున్నాం.. కానీ గ్రామస్తులందరూ మా దగ్గరకు వచ్చి అక్కడ వద్దు ఊరు నడిబొడ్డునే పెట్టాలనే గ్రామస్తుల ఆలోచన, చొరవతోనే విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేత, జక్కంపూడి తనయుడు జక్కంపూడి కిషోర్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తన తండ్రి పేరు ప్రఖ్యాతలు గడించాలని గుర్తు చేశారు. తాను ఎక్కడికి వెళ్లినా తన తండ్రి పేరు చెబితే ఏ పనైనా వెంటనే చేసే వాళ్ళని ఒకింత కన్నీటి పర్వతమయ్యారు. బిల్లు పాడుతో పాటు చుట్టుపక్క గ్రామస్తులందరూ కలిసి భారీ ర్యాలీ నిర్వహించి పెద్ద ఎత్తున ప్రోగ్రాం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు హాజరవుతారని, సాయంత్రం 5 జరిగే కార్యక్రమానికి భారీ ర్యాలీ ఉంటుందని తెలిపారు. అనంతరం జక్కంపూడి చిన్న కుమారుడు రాము మాట్లాడుతూ నాన్న మా కుటుంబ సభ్యులతో కంటే ప్రజల సమస్యల పరిష్కారం కోసమే తపించేవాడని గుర్తు చేశారు. ఈ కార్యక్రమాన్నికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు కాపా సుధాకర్, దుండేటి వీరారెడ్డి, దిరిశాల నరసింహారావు, దీవెల కృష్ణయ్య, కొమ్మినేని వెంకటేశ్వరరావు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, రాయల రాము, స్వామినేని రామ అప్పారావు, తుమ్మలపల్లి రమేష్, పొన్నం కృష్ణయ్య, గణేశుని రవి, జక్కంపూడి ముఖ్య అనుచరుడు వేముల గోవిందు, నారపోగు ప్రసాద్, తూము వీరభద్రరావు, అడపా అనిల్ చౌదరి, గోవిందు శ్రీనివాస్, తాళ్ల జోసెఫ్, రావుల గోపి గౌడ్, పాల్గొన్నారు.

# విద్యార్థిని అఫ్రియా ప్రతిభ అమోఘం

**- డిఇఓ సోమశేఖర శర్మ**







**సత్తుపల్లి/మార్చి28(జర్నలిస్ట్ వార్త):**

విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి గురువులు,తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే అఫ్రియా వంటి మేధావులను సమాజానికి అందించ వచ్చని ఖమ్మం జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ అన్నారు.విశ్వావసు ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం విశ్వశాంతి పాఠశాల విద్యార్థిని మహమ్మద్ అఫ్రియా బాల అవధానిగా వేమన శతకంపై 12 మంది పృచ్ఛకులతో ద్వాదశ పృచ్ఛక అవధానం జరిగింది. స్థానిక జేవీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో గార్లపాటి,బొల్లేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవధాన కార్యక్రమంలో డిఈఒ శర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 8 మంది పృచ్ఛకులు వేమన శతకంలో వివిధ అంశాలపై ప్రశ్నలు సంధించారు.డిఈఒ శర్మ సైతం వేమన శతకం లోని అనేక వందల పదాలలో ఒక పదాన్ని చెప్పగా ఆ పదం ఏ పద్యంలో ఉందో చెప్పి పూర్తిగా పద్యాన్ని అప్పగించింది. సమావేశంలో సత్తుపల్లి, పెనుబల్లి మండల విద్యాధికారులు రాజేశ్వరరావు, సత్యనారాయణలు మాట్లాడుతూ పట్టుమని పది పద్యాలు చదవడం రాని నేటి పరిస్థితులలో 100 వేమన పద్యాలు చదవడం, రాయడం నేర్చుకోవడమే గొప్ప అయితే ఏకంగా శతకంపై అవధానం చేసి మహమ్మద్ అఫ్రియా అద్భుతాన్ని సృష్టించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల తెలుగు విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు పూర్ణచంద్రరావు మాధవి,గార్లపాటి-బొల్లేపల్లి స్మారక ట్రస్ట్ నిర్వాహకులు రామకృష్ణ, మధుసూదన రాజు, విశ్వశాంతి యాజమాన్యం పసుపులేటి నాగేశ్వరరావు, నరకుళ్ళ సత్యనారాయణ, అఫ్రియా తల్లిదండ్రులు ఉస్మాన్,రబియా, సృజన వాసు, హెచెం.యాకూబ్,ఆషా,లయన్స్ సంస్థల నిర్వాహకులు ,ఉపాధ్యాయులు రమణమూర్తి, నర్సయ్య, రమణ,కాశీం,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలను తెలుసుకోండి, ప్రచారం చేయండి

**- అంగన్వాడీ సెక్టార్ మీటింగ్ లో హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులు.**






**వైరా/మార్చి29(జర్నలిస్ట్ వార్త):**చట్టాలను తెలుసుకోండి, ప్రచారం చెయ్యాలని హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిల్లిముంత వెంకటేశ్వరావు అన్నారు. శుక్రవారం వైరా మండలం, ముసలమడుగు గ్రామంలో అంగన్వాడీ కేంద్రములో జరిగిన సెక్టార్ మీటింగ్ గ్రామంలో బహుజన అభ్యుదయ సేవా సమితి, హ్యూమన్ రైట్స్ సొసైటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిల్లిముంత వెంకటేశ్వరావు అధ్యక్షతన అంగన్వాడి టీచర్లకు మానవ హక్కులు- మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ సొసైటీ వ్యవస్థాపకులు ఆదూరి ఆనందం మాట్లాడుతూ మా పనులు మేము చేసుకుంటూ కొంత సమయాన్ని మానవ హక్కులను ప్రచారం చేయడానికి స్వచ్ఛందంగా కేటాయించి, ఆశా కార్యకర్తలకు డ్వాక్రా మహిళలకు, విద్యార్థులకు, అంగన్వాడీ లకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రాష్ట్ర కన్వీనర్ కువ్వారపు విజయరావుమాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన మహిళా హక్కులను దుర్వినియోగం చేయకుండా, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖమ్మం జిల్లా అధ్యక్షులు పూర్ణకంటి కృష్ణ మహిళలకు సమాజంలో అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని తెలుసుకొని మరికొంత మందికి తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళా హక్కులు, వినియోగదారుల హక్కు చట్టం, పోక్సో చట్టం, పోలీస్ చట్టం,బాల్య వివాహాలు మొదలగు చట్టాలపై అవగాహన కల్పించి, నూతన చట్టాలపై పూర్తి అవగాహన కల్పించారు.అనంతరం అంగన్వాడి టీచర్లు హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ సరిత, వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన స్వీట్స్ రీ సైక్లింగ్

**మళ్లీ కొత్తగా స్వీట్స్ తయారీ**
**మల్లాపూర్ ఆమన్ స్వీట్స్ షాప్‌పై దాడి**
**లైసెన్స్ రద్దు చసి, షాపు సీజ్ చేసిన అధికారులు**



హైదరాబాద్మార్చి28(జర్నలిస్ట్ వార్త):

ప్రముఖ స్వీట్ షాపులో కూడా కల్తీ జరుగుతుందని విషయం ఇప్పుడు బయటపడింది.. ప్రముఖ స్వీట్ షాపులకు సరఫరా చేస్తున్నా తయారీ కేంద్రం పైన ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. ఈ సోదాల్లో భయంకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి.. మల్లాపూర్ లోని అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం పైన ఫుడ్ సేఫ్టీ అధికారులు సోదాలు నిర్వహించారు.. భయంకరమైన నిజాలతో వెంటనే దానిని సీజ్ చేయడం జరిగింది.. స్వీట్ షాపుల్లో మిగిలిపోయిన లేదా కాలం చెల్లిన స్వీట్స్ ని అన్నిటిని ఇక్కడికి చేర్చి వాటితో మళ్లీ కొత్త స్వీట్స్ తయారు చేసి అదే స్వీట్ షాప్ లోకి పంపిస్తున్నారు. కాలం చెల్లిన స్వీట్స్ ని రీసైకిల్ చేసి కొత్త స్వీట్స్ పై కొత్త లేబులింగ్ చేసి తిరిగి షాపుల్లోకి స్లపై చేస్తున్నారు.. దీంతో పాటు నాసిరకం వస్తువులను వాడుతున్నారు.. అపరిశుభ్రత మధ్యలో స్వీట్స్ ను తయారుచేసి స్లపై చేస్తున్నట్లు- ఫుడ్ సేఫ్టీ అధికారుల విచారణలో బయటపడింది ..దీంతో స్వీట్ షాపు స్వీట్ కర్మగారాన్ని వెంటనే అధికారులు సీజ్ చేశారు.. దాని లైసెన్సులు కూడా రద్దు చేస్తున్నట్లు- ప్రకటించారు. మల్లాపూర్ లో అమన్ స్వీట్స్ తయారీ కేంద్రం లో విజిలెన్స్, ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేశారు. ఈ దాడిలో, సరైన పరిశుభ్రత మరియు పారిశుధ్య నిర్వహణ లోపం, ఆహార పదార్థాల లేబులింగ్, రికార్డుల గడువు ముగిసిన ఆహార పదార్థాలను చూసి అవాక్కు అయ్యారు. గడువు ముగిసిన స్వీట్లను మళ్లీ కొత్త స్వీట్లు- తయారీలో వాడటన్ని, పరిశుభ్రత లేని ప్రదేశంలో తయారు చేయడం అధికారులు గుర్తించారు. వేరే జిల్లా లో తీసుకున్న లైసెన్సుతో మల్లాపూర్ లో పరిశ్రమను ఏర్పాటు చేయడం పై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. లైసెన్సు క్యాన్సల్ చేస్తున్నామని తెలిపారు. శాంపిల్ ను సేకరించి ల్యాబ్ కు పంపిస్తున్నమని తెలిపారు.

# బెంగళూరు విజయం

## 17 ఏళ్ల తర్వాత చెపాక్‌లో మురిసిన బెంగళూరు
## 50 రన్స్ తేడాతో చెన్నై చిత్తు రజత్ పటీదార్ హాఫ్ సెంచరీ

చెన్నై: ఒకటా.. రెండా ఏకంగా 17 ఏళ్ల తర్వాత రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇక్కడి చెపాక్ మైదానంలో విజయం రుచి చూసింది. బ్యాటింగ్‌లో మెరుపులతో పాటు బౌలింగ్‌లోనూ అదరగొట్టిన ఆర్‌సీబీ శుక్రవారం చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 50 రన్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. ఐపీఎల్ ఆరంభ సీజన్ 2008లో బెంగళూరు ఇక్కడ తొలిసారి గెలిచింది. అప్పటికి విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయకపోవడం గమనార్హం. శు క్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 7 వికెట్లకు 196 పరుగులు చేసింది. రజత్ పటీదార్ (32 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 51), సాల్ట్ (16 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 32), విరాట్ (30 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్‌తో 31) రాణించారు. నూర్ అహ్మద్‌కు మూడు, పథిరనకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 20 ఓవర్లలో 8 వికెట్లకు 146 పరుగులు చేసి ఓడింది. రచిన్ (41), ధోనీ (30 నాటౌట్), జడేజా (25) ఫర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు మూడు.. యష్, లివింగ్‌స్టోన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రజత్ పటీదార్ నిలిచాడు.

ఆది నుంచే తడబ్యాటు..: ఆర్‌సీబీ ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగిన చోట సీఎసకే బ్యాటర్లు తెగ కష్టపడ్డారు. అటు పేసర్లు, స్పిన్నర్లు సమష్టిగా రాణించి ఈ విజయంలో కీలకమయ్యారు. టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ ఎలాంటి ప్రభావమూ చూపలేకపోయింది. ఓపెనర్ రచిన్ మాత్రం కాస్త నిలదొక్కుకోగా.. చివర్లో ధోనీ మెరుపులతో ఊరటనిచ్చాడు. పేసర్ హాజెల్‌వుడ్ రెండో ఓవర్‌లోనే ఓపెనర్ త్రిపాఠి (5), కెప్టెన్ రుతురాజ్ (0)లను వెనక్కి పంపి షాకిచ్చాడు. దీపక్ హుడా (4)ను భువనేశ్వర్ అవుట్ చేయడంతో జట్టు పవర్‌ప్లేలో 30/3 స్కోరుతో దయనీయంగా కనిపించింది. హిట్టింగ్ కోసం వచ్చిన సామ్ కర్రాన్ (8) చేసేదేమీ లేకపోయింది. ఈ దశలో రచిన్–దూబే జోడీ అడపాదడపా బౌండరీలతో ఆశలు రేపింది. అయితే 13వ ఓవర్‌లో పేసర్ యష్ ఈ ఇద్దరినీ బౌల్డ్ చేసి సీఎసకేకు ఓటమిని కళ్లముందుంచాడు. అప్పటికి స్కోరు 80/6. అశ్విన్ (11)ను స్పిన్నర్ లివింగ్‌స్టోన్ అవుట్ చేశాక 16వ ఓవర్‌లో ధోనీ క్రీజులోకి వచ్చాడు. అప్పటికి సమీకరణం 29 బంతుల్లో 98 రన్స్‌గా ఉండడంతో చెపాక్‌లో ఆర్‌సీబీ విజయం ఖాయమైంది. జడేజా –ధోనీ మధ్య 8వ వికెట్‌కు అత్యధికంగా 31 పరుగులు జత చేరినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్‌లో 67 రన్స్ అవసరపడగా.. ధోనీ 6,6,4తో




ఫ్యాన్స్‌లో కాస్త జోష్ నింపాడు.

రజత్, సాల్ట్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీకి ఓపెనర్ సాల్ట్ మెరుపు ఆరంభాన్ని అందించాడు. అలాగే బరిలోకి దిగిన ప్రతీ బ్యాటరూ బాదడమే లక్ష్యంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ ఓపెనర్ విరాట్ మాత్రం షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డాడు. అటు కెప్టెన్ రజత్ పటీదార్ మూడు క్యాచ్‌లను చెన్నై ఫీల్డర్లు వదిలేయడం ఆర్‌సీబీ భారీ స్కోరుకు కారణమైంది. ‘స్పిన్నర్ నూర్ అహ్మద్ మరోసారి ప్రభావం చూపాడు. తొలి ఓవర్‌లోనే సాల్ట్ రెండు ఫోర్లు, తర్వాతి ఓవర్‌లో 6,4,4తో ఎదురుదాడికి దిగాడు. ఐదో ఓవర్‌లో అతడిని స్పిన్నర్ నూర్ అహ్మద్ అవుట్ చేయగా తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత దేవ్‌దత్ సిక్సర్‌తో పవర్‌ప్లేలో జట్టు 56/1తో నిలిచింది. ఏడో ఓవర్‌లో పడిక్కళ్ 4,4,6తో 15 పరుగులు రాబట్టాడు. అశ్విన్ ఓవర్‌లో తను నిష్క్రమించాక బరిలోకి దిగిన పటీదార్ మరింత చెలరేగాడు. అయితే అతను 17 పరుగుల వద్ద ఉన్నప్పుడు ఇచ్చిన సులువైన క్యాచ్‌ను లాంగాఫ్‌లో దీపక్ హుడా వదిలేయడం ఆర్‌సీబీకి కలిసివచ్చింది. అటు నెమ్మదిగా ఆడి ఒత్తిడికి లోనైన విరాట్‌ను నూర్ అహ్మద్ అవుట్ చేశాడు. 14వ ఓవర్‌లో రజత్ 6,4,4తో 15 రన్స్‌తో స్కోరు మళ్లీ వేగం పుంజుకుంది. లివింగ్‌స్టోన్ (10), జితేశ్ (12) స్వల్ప స్కోర్లకు వెనుదిరగ్గా, 30 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసిన పటీదార్ 19వ ఓవర్‌లో భారీ షాట్‌కు వెళ్లి పథిరనకు చిక్కాడు. ఈ ఓవర్‌లో వైడ్ రూపంలో ఒకే పరుగు రాగా క్రునాల్ కూడా డకౌటయ్యాడు. అయితే ఆఖరి ఓవర్‌లో టిమ్ డేవిడ్ (22 నాటౌట్) హ్యాట్రిక్ సిక్సర్లతో 19 రన్స్ అందించడంతో ఆర్‌సీబీ 190 రన్స్ దాటగలిగింది.

ధోనీ.. మరోసారి: ధోనీ మెరుపు స్టంపింగ్ మరోసారి ఫ్యాన్స్‌ను అబ్బురపరిచింది. ముంబైతో మ్యాచ్‌లో సూర్యకుమార్‌ను అవుట్ చేసిన మాదిరే.. ఈసారి ఆర్‌సీబీపై ఓపెనర్ సాల్ట్ పనిబట్టాడు. వేగంగా ఆడుతున్న అతడిని స్పిన్నర్ నూర్ అహ్మద్ ఓవర్‌లో 0.16 సెకన్లలోనే స్టంప్ చేశాడు. వాస్తవానికి సాల్ట్ క్రీజులో నుంచి కాళ్లు తీసినట్టుగా కూడా కనిపించలేదు. కానీ రీప్లేలో మాత్రమే అతడి కాలు గాల్లోకి లేచినట్టు



## ఖలీల్‌పై టాంపరింగ్ ఆరోపణలు
### సోషల్ మీడియాలో వీడియో హల్చల్



2025 ఐపీఎల్‌లో బాల్ ట్యాంపరింగ్ ఆరోపణలు కలకలం సృష్టిస్తున్నాయి. చెపాక్ వేదికగా ఆదివారం ముంబయితో జరిగిన మ్యాచ్‌లో చెన్నై బౌలర్ ఖలీల్ అహ్మద్ బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డాడంటూ క్రికెట్ ఫ్యాన్స్ ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో ఖలీల్ అహ్మద్ తన జేబులో నుంచి ఏదో తీసి చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు ఇచ్చినట్లు కనిపిస్తోంది. దీంతో రుతురాజ్– ఖలీల్ బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడ్డారని క్రికెట్ ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. ఈ బాల్ ట్యాంపరింగ్ అంశం సోషల్ మీడియాను కుదిపేస్తోంది. చెన్నై సూపర్ కింగ్స్ బాల్ ట్యాంపరింగ్‌కు పాల్పడిందని, అందుకే ఆ జట్టును బ్యాన్ చేయాలంటూ కొందరు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఫిక్సర్లను ఐపీఎల్ నుంచి శాశ్వతంగా నిషేధించాలని పోస్టులు పెడుతున్నారు. ఈ వీడియో పెద్ద చర్చకు దారి తీసింది. అసలు వాళ్లిద్దరి మధ్య జరిగిన సంభాషణ ఏంటా అని చర్చించుకుంటున్నారు. అయితే ఖలీల్ తన జేబులోంచి చిన్న అట్ట ముక్కలాంటిది రుతురాజ్‌కు ఇచ్చి ఉంటాడని ఆరోపిస్తున్నారు. అలా అట్టముక్కతో బంతిపై రుద్దితే స్వింగ్ చేసే బౌలర్లకు ఆ బంతి బాగా సహకరిస్తుందని అంటున్నారు. ఏది ఏమైనా ఈ వీడియో మాత్రం ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. దీంతో ఈ బాల్ ట్యాంపరింగ్ అంశంపై బీసీసీఐ దర్యాప్తు చేయాలని కోరుతున్నారు.
..

## మ్యాచ్ మధ్యలో తమిమ్ ఇక్బాల్‌కు గుండెపోటు
### హుటాహుటిన ఆసుపత్రికి తరలింపు



బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ డివిజన్ క్రికెట్ లీగ్ మ్యాచ్‌లో అతడు రెండుసార్లు గుండెపోటుకు గురయ్యాడు. దీంతో తమిమ్‌ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తమీమ్ పరిస్థితి సీరియస్‌గానే ఉందట. అతడికి వెంటిలేటర్‌పై ట్రీట్‌మెంట్ అందిస్తున్నట్లు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు చీఫ్ ఫిజీషియన్ దేబాశీష్ చౌధురి వెల్లడించారు. ఢాకా ప్రీమియర్ లీగ్‌లో భాగంగా సోమవారం మహమ్మదన్ స్పోర్టింగ్ క్లబ్–షినెపుకర్ క్రికెట్ క్లబ్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. ఈ లీగ్‌లో తమిమ్ మహమ్మగన్ క్లబ్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. ఈ క్రమంలో తమీమ్ టాస్ కోసం మైదానంలోకి వచ్చాడు. మరికాసేపట్లో మ్యాచ్ ప్రారంభం అవుతుందనగా, అతడికి సడెన్‌గా ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించి పరీక్షించగా స్వల్ప గుండెపోటుగా గుర్తించారు. గుండెపోటు అని తేలడం వల్ల తమిమ్‌ను ఢాకా తరలించేందుకు హెలికాప్టర్ ఏర్పాటుచేశారు. కానీ, హెలిప్యాడ్‌కు వెళ్తుండగా మరోసారి హార్ట్ ఎటాక్‌కు గురయ్యాడు. దీంతో తిరిగి అదే ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నారని దేబాశీష్ వెల్లడించారు. అటు తమిమ్ ఆరోగ్యంపై అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అతడు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నారు.

## కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్‌కె మజుందార్



బెంగళూరు : కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్‌కె మజుందార్ (56) సోమవారం బాధ్యతలు చేపట్టారు. మజుందార్ చార్టెర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్స్ విభాగంలో ప్రత్యేక అర్హతలు కలిగి ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలోనూ సుదీర్ఘకాలం సేవలందించారు. 2000 నుంచి కెనరాబ్యాంకుతో సంబంధాలు కలిగి ఉన్నారు. సుదీర్ఘమైన కెరీర్‌లో వివిధ హోదాలలో ఆయన సేవలందించారు. ఆయన నాయకత్వంలో కెనరాబ్యాంకు మరిన్ని రంగాలలో రాణించనుందని బ్యాంకు ఒక ప్రకటనలో పేర్కొంది.

### ఒకే రీఛార్జ్‌తో ముగ్గురికి ఉపయోగం..
## సరికొత్త ప్లాన్ ప్రవేశపెట్టిన బీఎస్ఎన్ఎల్

భారత టెలికాం రంగంలో ఆయా కంపెనీల మధ్య పోటీ క్రమంగా పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రధానంగా ప్రభుత్వ సంస్థ %దీూచీూ% వినియోగదారులను ఆకట్టుకునేందుకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా, బీఎస్ఎన్ఎల్ కొత్త ఫ్యామిలీ ప్లాన్‌ను అనౌన్స్ చేసింది. దీని స్పెషల్ ఏంటంటే ఒకే రీఛార్జ్‌తో ముగ్గురు కుటుంబ సభ్యులు సేవలను పొందవచ్చు. ఈ ప్లాన్ అన్ని పోస్ట్‌పెయిడ్ వినియోగదారుల కోసం అమల్లో ఉంటుందని కంపెనీ తెలిపింది. దీంతో కొత్తగా ప్రవేశపెట్టిన రూ.999 ఫ్యామిలీ ప్లాన్, వినియోగదారుల ఆదరణను క్రమంగా పెంచుకుంటోంది. ఈ ప్లాన్ ద్వారా ఒక వ్యక్తి రీఛార్జ్ చేసుకుంటే, మరో ఇద్దరు కూడా దీని సేవలను పొందవచ్చు. ఈ విధంగా, ముగ్గురు కుటుంబ సభ్యులు ఒకే ధరకు సేవలను వినియోగించుకోవచ్చు. ప్రత్యేకంగా ఈ ప్లాన్ ద్వారా వ్యక్తిగత ప్లాన్‌ల అవసరాన్ని తొలగించి, కుటుంబంలో ఉన్న వారందరికీ సమానమైన సేవలు అందించడం సాధ్యమవుతుంది.




బీఎస్ఎన్ఎల్ ఫ్యామిలీ ప్లాన్ ప్రత్యేకత ఏమిటంటే, ఇది మూడు వేర్వేరు కనెక్షన్‌లను ఒకే రీఛార్జ్‌తో అనుసంధానం చేసుకోవచ్చు. దీంతో, వేర్వేరు వ్యక్తుల కోసం ప్రత్యేక రీఛార్జ్‌లు చేయాల్సిన అవసరం కూడా ఉండదు. ఒకే ప్లాన్‌లో ముగ్గురు కుటుంబ సభ్యులు సేవలను పొందవచ్చు. ఆ క్రమంలో ప్రతి యూజర్‌కు సొంతంగా 75%+దీ% డేటా, రోజు 100 ఉచిత %వామీ%లు, అపరిమిత ఉచిత కాలింగ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. రూ.999 ఫ్యామిలీ ప్లాన్‌లో భాగంగా ప్రతి వినియోగదారునికి 75%+దీ% డేటా కేటాయించబడుతుంది. అంటే ఇది మొత్తం ముగ్గురికి కలిపి 300%+దీ% డేటా లభిస్తుంది. ముఖ్యంగా కుటుంబ సభ్యులు ఒకేసారి వాడటానికి, అలాగే, ప్రతి యూజర్‌కు రోజుకు 100 ఉచిత %వామీ%లు లభిస్తాయి.

ఈ ప్లాన్ మరో ముఖ్యమైన ప్రయోజనం ఏంటంటే అపరిమిత ఉచిత కాలింగ్. ఇది ప్రాథమిక వినియోగదారుకు మాత్రమే కాకుండా, కనెక్ట్ చేయబడిన ఇతర నంబర్లకు కూడా అపరిమిత ఉచిత కాలింగ్ సేవలను అందిస్తుంది. ప్రత్యేకంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు ఏ రకమైన ఫోన్ బిల్లు లేకుండా కాలింగ్ చేసుకోవడానికి ఛాన్స్ ఉంటుంది. ఇది ప్రధానంగా టెలికాం ఖర్చులను తగ్గించుకోవాలనుకునే కుటుంబాలకు మంచి ఎంపికగా ఉంటుంది.


## క్రికెటర్ పై హర్భజన్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు
### ప్యానెల్ నుంచి తప్పించాలని డిమాండ్



ఐపీఎల్ 2025లో కొత్త వివాదం తలెత్తింది. సీఎస్కే – ముంబయి మ్యాచులో కామెంటేటర్ గా వ్యవహరించిన టీమిండియా మాజీ ప్లేయర్ హర్భజన్ సింగ్ చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారీ తీశాయి. భజ్జీ జాత్యహంకార వ్యాఖ్యలు చేశాడని క్రికెట్ అభిమానులు ఆరోపిస్తూ.. అతడిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. అతడిని కామెంటేటరీ ప్యానెల్ నుంచి తప్పించాలని డిమాండ్లు చేస్తున్నారు. గత కొద్ది కాలంగా ఆటకు దూరంగా ఇంగ్లాండ్ స్టార్ ఫాస్ట్ బౌలర్ జోఫ్రా ఆర్చర్.. ఐపీఎల్ తాజా సీజన్ లో అడుగుపెట్టాడు. అయితే ఈ రాజస్థాన్ బౌలర్.. సన్‌రైజర్స్ బ్యాటర్ల దెబ్బకు విలవిలలాడాడు. నాలుగు ఓవర్ల ఫుల్ స్పెల్ వేసిన అతడు.. తొలి ఓవర్ లోనే 23 పరుగులు సమర్పించుకున్నాడు. ఆ తర్వాత 12, 22,23.. ఇలా భారీగా పరుగులు సమర్పించుకున్నాడు. తద్వారా 76 పరుగులతో ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత చెత్త గణాంకాలు నమోదు చేశాడు. దీంతో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ పై విమర్శలు వచ్చాయి. అయితే ఇదే సమయంలో జోఫ్రా అర్చర్ బౌలింగ్ ను ఉద్దేశిస్తూ మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ కాంట్రవర్సీ కామెంట్స్ చేశాడు. మ్యాచ్ సమయంలో ఆర్చర్‌ను ‘కాలీ ట్యాక్సీ’తో పోల్చాడు. లండన్‌లో కాలీ (బ్లాక్ కలర్) ట్యాక్సీల మీటర్లలాగా.. ఆర్చర్ మీటర్ కూడా ఈ రోజు పెరిగిపోతోంది అని కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఈ కామెంట్స్ వివాదాస్పదంగా మారింది. ఇది విన్న క్రికెట్ అభిమానులు.. భజ్జీ జాత్యహంకార వ్యాఖ్యలు చేశాడని ఆరోపిస్తున్నారు. కామెంట్రీ ప్యానెల్ నుంచి హర్భజన్‌ను సస్పెండ్ చేయాలని అంటున్నారు. చూడాలి మరి ఈ ఆరోపణలపై హర్భజన్ సింగ్ ఎలా స్పందిస్తాడో..

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక..






# వెంకటేశ్‌తో హరీశ్ శంకర్ సినిమా

ఇటీవల విడుదలైన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సాధించాడు టాలీవుడ్ స్టార్ హీరో విక్టరీ వెంకటేష్. దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ చిత్రం పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులను ఆకర్షించడంలో విజయవంతమైంది. ఈ సినిమా ద్వారా వెంకటేష్ తన కెరీర్‌లో అతిపెద్ద బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు. దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టాడు. అయితే ఈ సినిమా విజయంతో ఉత్సాహంగా ఉన్న ఈ స్టార్ హీరో, తన తదుపరి చిత్రాన్ని సిద్ధం చేసే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వెంకటేష్ వివిధ దర్శకుల నుంచి కథలు వినడంలో బిజీగా ఉన్నాడని సమాచారం. ఈ సందర్భంలోనే ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ కూడా ఓ కథను వెంకటేష్‌కు వినిపించినట్లు తెలుస్తోంది. ఈ కథ వెంకీకి నచ్చడమే కాకుండా, నిర్మాత సురేష్ బాబు కూడా దీన్ని ఆమోదించినట్లు వార్తలు వస్తున్నాయి. సినీ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌ను వెంకటేష్ ఖరారు చేసినట్లు చర్చలు జరుగుతున్నాయి.ఈ చిత్రం వెంకటేష్ కెరీర్‌లో 77వ సినిమాగా రానున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందని సినీ సర్కిల్స్‌లో టాక్ నడుస్తోంది. సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ సినిమా తర్వాత హరీశ్ శంకర్‌కి అసలు హిట్ లేదన్న విషయం తెలిసిందే. దువ్వాడ జగన్నాథం సినిమా కలెక్షన్స్ సాధించిన కూడా ఫ్లాప్‌గా నిలిచింది. ఇక రీసెంట్‌గా మిస్టర్ బచ్చన్ అంటూ వచ్చి డిజాస్టర్‌ను అందుకున్నాడు. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసి మీదా ఉన్న హరీశ్ శంకర్ ప్రస్తుతం వెంకీమామ కోసం సాలిడ్ కథ రెడీ చేసినట్లు తెలుస్తుంది.

# కొత్త లుక్స్‌తో హల్‌చల్ చేస్తున్న అనన్యపాండే



బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్. అనన్య 2019లో "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2" చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీమేల్ డెబ్యూ కూడా లభించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. అనన్య తన కెరీర్‌లో పతి పత్నీ ఔర్ వో, లైగర్, డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో నటించింది. లైగర్ ఈ బ్యూటీ తొలి తెలుగు చిత్రం. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరసన ఆమె నటించింది, కానీ ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద విజయం సాధించలేదు. ఆ తర్వాత ఈ భామ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లపై దృష్టి సారించింది. గెహరాయియా, ఖో గయే హమ్ కహా, కంట్రోల్, కాల్ మీ బే వంటి ప్రాజెక్ట్‌లలో ఆమె నటన ప్రశంసలు అందుకుంది. ఆమె సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో అనన్య భారీ ఫాలోయింగ్ ఉంది. వ్యక్తిగత జీవితంలో ఆమె పలుమార్లు ప్రేమ వ్యవహారాల గురించి వార్తల్లో నిలిచింది. ముఖ్యంగా నటుడు ఆదిత్య రాయ్ కపూర్‌తో ఆమె రిలేషన్‌షిప్ గురించి చర్చలు జరిగాయి, అయితే వారు విడిపోయినట్లు వార్తలు వచ్చాయి. అనన్య తన నటనతో పాటు ఫ్యాషన్ సెన్స్‌తో కూడా యువతలో పాపులర్ అయ్యింది.

## రూ.700 కోట్ల బడ్జెట్‌తో

# హృతిక్‌రోషన్ సినిమా

బాలీవుడ్ స్టార్ నటుడు హృతిక్ రోషన్ మెగాఫోన్ పడుతున్నాడు. ఈ విషయాన్ని అతడి తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ హీరో చిత్రం క్రిష్ ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పటివరకు హాలీవుడ్ సూపర్ హీరోలు మాత్రమే తెలిసిన ప్రేక్షకులకు ఇండియన్ సూపర్ హీరోగా హృతిక్ రోషన్ అలరించాడు. కోయి మిల్ గయా, క్రిష్, క్రిష్ 3 సినిమాలు రాగా బ్లాక్ బస్టర్ అందుకున్నాయి. ఇప్పుడు ఇదే ఫ్రాంఛైజీ నుంచి క్రిష్ 4 రాబోతుంది. మొదటి మూడు పార్టులకు హృతిక్ రోషన్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించగా.. తాజాగా వచ్చే క్రిష్ 4తో హృతిక్ మెగాఫోన్ పట్టబోతున్నాడు. ఈ విషయాన్ని తెలుపుతూ.. హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. దుగ్గూ (హృతిక్ రోషన్) 25 సంవత్సరాల క్రితం నిన్ను నటుడిగా పరిచయం చేశాను. ఇప్పుడు 25 ఏళ్ల తర్వాత ఆదిత్య చోప్రా నేను కలిసి దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నాం. దర్శకుడిగా నీ ప్రయాణంలో నువ్వు అనేక విజయాలు సాధించాలని ఆశిస్తున్నాను. మా ప్రతిష్టాత్మక చిత్రం 'క్రిష్ 4'కి నీవు దర్శకత్వం వహిస్తుండటం సంతోషంగా ఉందంటూ రాకేష్ రోషన్ రాసుకొచ్చాడు. ఈ విషయం తెలిసిన బాలీవుడ్ ప్రముఖులు హృతిక్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. మరోవైపు ఈ ప్రాజెక్ట్ రూ.700 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్నట్లు సమాచారం.



# క్రేజీ కాంబో

## విజయదేరవకొండతో కీర్తిసురేష్ సినిమా



'మహానటి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డు అందుకున్న కీర్తి సురేష్ ఈ మధ్య తెలుగులో కనిపించడం లేదు. గతేడాది వివాహం బంధంలోకి అడుగుపెట్టిన ఈ బ్యూటీ 'బేబీ జాన్'తో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. గతంలో హెూమ్లీగా కనిపించే ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్‌లోకి వెళ్లగానే తనలోని మరో కోణాన్ని బయటపెట్టింది. బేబీ జాన్‌తో ఆమె గ్లామర్‌కి నార్త్ జనాలు ఫిదా అయిపోయారు. దీంతో సినిమా డిజాస్టర్ అయినా కీర్తి మాత్రం మంచి మార్కులే కొట్టేసింది. పెళ్లి తర్వాత దూకుడి పెంచిన కీర్తి మళ్లీ టాలీవుడ్‌పై ఫోకస్ పెట్టింది. దీంతో ఆమెకు వరుస ఆఫర్లు వెల్లువెత్తుతున్నాయి. నితిన్, వేణు యెల్దండి కాంబినేషన్లో దిల్ రాజు నిర్మిస్తోన్న 'ఎల్లమ్మ'లో కీర్తి సురేష్ నటిస్తోందంటూ వార్తలొస్తున్నాయి. ఈ క్యారెక్టర్ కోసం ముందుగా సాయిపల్లవిని అడిగితే డేట్స్ అడ్జట్స్ లేక నో చెప్పేసిందట. దీంతో ఆమె ఆఫర్ కీర్తి వద్దకు చేరినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై యూనిట్ నుంచి ఎలాంటి సమాచారం లేదు. తాజాగా ఈ భామ రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ పక్కన ఛాన్స్ కొట్టేసింది. ప్రస్తుతం విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' అనే సినిమాలో నటిస్తున్నాడు. దీని తర్వాత 'రాజావారు రాణిగారు' ఫేమ్ రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్ధన్' మూవీ చేయనున్నాడు. దీనికి దిల్ రాజు నిర్మాత. ఈ ప్రాజెక్టులో కీర్తి సురేష్‌ని తీసుకుంటే కాంబినేషన్ అదిరిపోతుందని మేకర్స్ భావిస్తున్నారట. ఇక సుహాస్ పక్కన 'ఉప్పు కప్పురంబు' మూవీ ఇప్పటికే కన్ఫామ్ అయిన సంగతి తెలిసిందే. జాతీయ ఉత్తమ నటిగా అవార్డు అందుకుని 'మహానటి'గా కీర్తించబడుతోన్న కీర్తి సురేష్ ఇకపై కమర్షియల్ బాటలో నడుస్తూ గ్లామర్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకోవాలని తెగ ఆరాటపడుతోందట. చాలామంది హీరోయిన్లు కెరీర్ తొలినాళ్లలో గ్లామర్ పాత్రలు చేసి పెళ్లి తర్వాత హెూమ్లీగా కనిపించడానికి ప్రయత్నిస్తారు. కీర్తి మాత్రం ఇన్నాళ్లూ కాస్త పద్ధతిగా కనిపించి పెళ్లి తర్వాత గ్లామర్ ట్రీట్ ఇవ్వడానికి తెగ కష్టపడుతోంది. బాలీవుడ్‌కి వెళ్లిన తర్వాత తత్వం బోధపడి ఇలాంటి నిర్ణయం తీసుకుని ఉండొచ్చని ఫాన్స్ అనుకుంటున్నారు. ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులను లైన్లో పెడుతోన్న కీర్తికి ఒకట్రెండు హిట్లు పడ్డాయంటే ఇప్పట్లో ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదు. ఇక బాలీవుడ్‌లో 'బేబీ జాన్' తర్వాత రాకింగ్ స్టార్ రణబీర్ కపూర్ పక్కన కీర్తి ఛాన్స్ కొట్టేసినట్లు ప్రచారం జరుగుతోంది. రొమాంటిక్ లవ్ స్టోరీగా తెరకెక్కే ఈ మూవీలో కీర్తి సురేష్ గ్లామర్ షోకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసిందట. అయితే ప్రస్తుతం రామాయణ, లవ్ అండ్ వార్‌బీ యానిమల్ పార్క్ వంటి చిత్రాలతో రణబీర్ బిజీగా ఉండటంతో ఈ ప్రాజెక్టు ఎప్పుడు పట్టాలెక్కుతుందో క్లారిటీ లేదు.



# పూరీ జగన్నాథ్ సినిమాకు నో చెప్పాను: రకుల్ ప్రీత్ సింగ్



పెళ్లి చేసుకున్న తర్వాత కూడా రకుల్ ప్రీత్ సింగ్ తన యాక్టింగ్ కెరీర్ ను కొనసాగిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. చదువుకునే రోజుల్లోనే తాను మోడలింగ్ ఇండస్ట్రీకి వచ్చానని... అప్పుడు తనకు సినిమాల గురించి పెద్దగా తెలియదని చెప్పింది. సౌత్ సినిమా గురించి అస్సలు తెలియదని వెల్లడించింది. కాలేజ్ లో చదువుకుంటూ మోడలింగ్ చేస్తున్నప్పుడు తన ఫొటోలు చూసి కన్నడ సినీ పరిశ్రమ నుంచి తొలి అవకాశం వచ్చిందని రకుల్ తెలిపింది. దక్షిణాది చిత్రాల గురించి తనకు ఏమీ తెలియకపోవడంతో చాలా ఆలోచించానని... వాళ్లు తన తండ్రికి ఫోన్ చేసి మాట్లాడటంతో 'గిల్లి' సినిమాలో నటించానని వెల్లడించింది. తన తొలి సినిమాతోనే యాక్టింగ్ అంటే తనకు ఎంతో నచ్చేసిందని... చదువు పూర్తి చేసి సినిమాల్లో కొనసాగాలని డిసైడ్ అయ్యానని తెలిపింది.తొలి సినిమా విడుదల తర్వాత దర్శకుడు పూరి జగన్నాథ్ నుంచి తనకు ఫోన్ వచ్చిందని... ఆయన తనను 70 రోజుల డేట్స్ అడిగారని... తాను నో చెప్పానని వెల్లడించింది. సినిమాలపై అవగాహన లేక చాలా చిత్రాలను వదులుకున్నానని తెలిపింది. తన అభిప్రాయాలు, జాకీ అభిప్రాయాలు కలిశాయని... దీంతో ఇద్దరం ఒక్కటయ్యామని... ఆ తర్వాత పెద్దల అంగీకారంతో పెళ్లి చేసుకున్నామని చెప్పింది.

# అట్లీతో అల్లుఅర్జున్ సినిమా?



అట్లీతో ఇప్పట్లో మూవీ చేయడం లేదని స్పష్టం చేశారు. అది భారీ బడ్జెట్ సినిమా అని అందుకే ప్రస్తుతానికి వాయిదా వేస్తున్నామని చెప్పారు. కానీ భవిష్యత్తులో కచ్చితంగా అట్లీతో సినిమా ఉంటుందని అన్నారు. సల్మాన్ ఖాన్ ప్రకటనతో బన్నీ అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. సల్మాన్ ఖాన్ తో ప్రస్తుతం సినిమా లేనందున అట్లీ అల్లు అర్జున్ కాంబోలో సినిమా సెట్స్ పైకి వెళ్తుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. నిజానికి బన్నీ పుష్ప తర్వాత త్రివిక్రమ్‌తో సినిమా చేయాల్సి ఉంది. అయితే అది భారీ బడ్జెట్ మైథలాజికల్ మూవీ కావడంతో మూవీ పట్టాలెక్కేందుకు ఇంకా టైం పట్టే ఛాన్సుంది. ఈ గ్యాప్‌లో అట్లీతో మూవీ చేయాలని అల్లు అర్జున్ భావిస్తున్నట్లు సమాచారం. అట్లీ, అల్లు అర్జున్ కాంబోలో తెరకెక్కనున్న సినిమాకు ఇప్పటికే కథ ఓకే అయిందని, త్వరలోనే అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఉగాది రోజున దీనికి సంబంధించి క్లారిటీ వచ్చే ఛాన్సుంది. ఒకవేళ వీరిద్దరి కాంబోలో సినిమా వస్తే పాన్ ఇండియా రేంజ్ లో మరో హిట్ పక్కా అని బన్నీ ఫ్యాన్స్ అంటున్నారు.